## శుచిగా బూందీ తయారీలో జాగ్రత్తలు అవసరం

### -బూందీపోటులో అదనపు ఈఓ వెంకయ్యచౌదరి

తిరుమల, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త ప్రతినిధి:



దేవుని దర్శనం తరువాత భక్తులు ప్రియంగా స్వీకరించే లడ్డూల తయారీలో కీలకమైన బూందీ తయారీలో కార్మికులు శుచితోబాటు జాగ్రత్తలు పాటించాలని టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంక య్యచౌదరి సూచించారు. బూందీపోటులో ఇటీవల అధునాతన పరికరాలు ఏర్పాటు చేయడంతో, పోటులో పరిస్థితులను తెలుసుకునేందుకు ఆయన శనివారం రాత్రి ఆల య డిప్యూటీ ఈఓ లోకనాథంతో కలసి అక్కడ బూందీతయారీ, నెయ్యివినియోగం, పిండి మిక్సింగ్, ముడిపదార్థాలు పోటుకు తరలించే విషయం. పోటు సిబ్బంది భక్తితో, విశ్వాసంతో బూందీతయారీలో నిమగ్నంకావాలని సూచించారు. లడ్డూకౌంటర్లను తనిఖీ చేశారు.

# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



### జనసేన నేత

## నన్ను మోసం చేశాడు

### బాధిత మహిళ ఆరోపణ
### వైసిపి కుట్రేనంటూ ఆ నేత మీడియాతో వివరణ



తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని నెలలు కావస్తున్నా జనసేనపార్టీ నేత కిరణ్‌రాయల్ తిరిగి ఇవ్వలేదని, కొంతకాలంగా అడుగుతుంటే డబ్బులు ఇవ్వకపోగా అన్ని రకాలుగా తనను మోసం చేశాడని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. అతను చేసిన మోసానికి ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్నట్లు ముందుగానే రికార్డుచేసిన వీడియో వైరల్ కావడంతో వెలుగుచూసింది. ఈ తతంగమంతా వైసిపి కుట్రేనని శనివారం రాత్రి కిరణ్‌రాయల్ మీడియా ముందుకు రావడంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని నగరంలో సంచలనంగా మారింది. బైరాగిపట్టెడకు చెందిన లక్ష్మి కిరణ్‌రాయల్ అవసరాలకు 2022లో పలు ధపాలుగా1.20కోటి రూపాయలు నగదు సర్దుబాటు చేసింది. ఏకంగా తన అవసరాలకు నన్ను పావుగా మార్చేశాడని ఆరోపించింది. డబ్బులు ఇవ్వకుండా మోసం చేశాడని, ఆ బాధను భరించలేక తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని ఆమె వీడియోను విడుదల చేసింది. అంతే కాకుండా తనను బెదిరించి రూ. 30లక్షల చెక్కులు బాండ్లు రాయించుకున్నాడని ఆరోపించింది.. ఇచ్చిన డబ్బు లు అడిగితే తన పిల్లలను చంపుతానని బెదిరిస్తున్నారని ఆమె పేర్కొంది. ఆత్మహత్యాయ త్నానికి పాల్పడి వేలూరు సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం.

**ఇదంతా వైసిపి చిల్లర రాజకీయాలు: కిరణ్**

బాధిత మహిళ చేసిన వీడియోవైరల్ కావడంతో కిరణ్‌రాయల్ కూడా శనివారం రాత్రి మీడియా ముందుకు వచ్చాడు. మాట్లాడుతూ ఇటీవల మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కార్పొరేటర్లు కూటమికి మద్దతు ఇవ్వడం, జనసేనపార్టీ నేతలు కలసి పనిచేయడంతో ఇదంతా వైసీపీ నేతల కుట్రలో భాగంగా జరుగుతోందని అన్నాడు. క్రిమినల్ కిలాడీ లేడీ లక్ష్మి ద్వారా నాపై నిరాధారణమైన ఆరోపణలు వైసిపి నేతలు చేయిస్తున్నారని తెలిపారు. ఆమె అంత భారీ మొత్తంలో డబ్బులు ఎక్కడ నుండి ఇచ్చిందని, అంత డబ్బులు తనకు ఇచ్చినట్లు ఎటువంటి ఆధారాలు లేవన్నారు. చీటీలకు సంబంధించి లావాదేవీలు ఉన్నాయని అవి ఎప్పుడో పూర్తయిందన్నారు.

## ఫిరాయించిన వారి మాటేంటో!?

### లోపాయికారి ఒప్పందకార్పొరేటర్లపై వేటుకు వెనుకంజ!!



ప్రభాతవార్త-తిరుపతి:

అనూహ్యానాటకీయ రాజకీయ పరిణామాల మధ్య అంతా అనుకున్నట్లే ఐదురోజుల క్రిందట తిరుపతి కార్పొరేషన్ కౌన్సిల్‌లో రెండవ డిప్యూటీ మేయర్ కూటమి కైవశం అయ్యింది. ఈ కుర్చీని టిడిపి ఒకేఒక్క కార్పొటర్ ఆర్‌సి మునికృష్ణ 25మంది కార్పొరేటర్ల మద్దతుతో చేజిక్కించుకున్న విషయం తెలిసిందే. ఊహించని పరిస్థితుల్లో వైసిపి విప్‌ను ధిక్కరించారనే నెపంతో కార్పొరేటర్లు ప్రవళికరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, తిరుత్తణి శైలజ, దూదికుమారి, రాధతో బాటు వారి కుటుంబంలో క్రియాశీలక సభ్యులను కూడా పార్టీనుండి బహిష్కరించిన విషయం విదితమే. అయితే 2021లో వైసిపి జెండాపై గెలిచి నాలుగేళ్ళు కౌన్సిల్‌లో పెత్తనం చలాయించి, పనులు చేసుకున్న డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, వైసిపి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డికి తొలినుండి నమ్మకస్థులుగా ఉన్న కొందరు కార్పొరేటర్లు ఎస్‌కె బాబు, ముద్రనారాయణ, పొన్నాలచంద్ర, నరసింహాచారి, పరదేశినరేంద్ర, కుడితి సుబ్రమణ్యం ఇంకొందరు కూటమివైపు చేరారు. గత మంగళవారం నాటి ఎన్నికలో టిడిపికి బలమైన మద్దతుపలికారు కూడా. ఇంకా వైసిపిలో కొందరు కార్పొరేటర్లు తెరవెనుక ఉండి కూటమికి ఓటేయడం జరిగిపోయింది. మరీ కప్పదాట్లుచేసి పార్టీకండువాలు మార్చుకునేందుకు సిద్దంగా ఉన్న 20మంది కార్పొరేటర్లపై వైసిపి నేతల మౌనం ఎందుకనే హాట్‌టాఫిక్ తిరుపతి నగరంలో సామాన్యజనంలో చర్చనీయాంశంగా మారింది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్‌లో 50మంది కార్పొరేటర్లుకు గాను డిప్యూటీ మేయర్ ఎన్నికల సమయానికి 47మంది కొనసాగుతున్నారు. వీరిలో 25మంది కూటమికి మద్దతు నివ్వడంతో, 21మంది వైసిపికి మద్దతుగానే చివరివరకు నిలబడ్డారు. మరీ వైసిపి విప్‌ను ధిక్కరించి కూటమికి ఓటేసిన ఇంకా 20మందిపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదనేది సమాధానంలేని ప్రశ్నగానే జనంలో చర్చ జరుగుతోంది.

**-వేటువేస్తే బలం ఉండదనే భయంతోనేనా!?:**

తిరుపతిలో తొలిసారిగా నగరపాలకసంస్థకు 2021లో జరిగిన కౌన్సిల్ ఎన్నికల్లో వైసిపి నుండి 48మంది గెలిచి నాలుగుసంవత్సరాలు పెత్తనం చలాయించారు. గత ఏడాది రాష్ట్రంలోనేగాక తిరుపతి ఎమ్మెల్యే స్థానం కూడా వైసిపి కోల్పోయింది. అప్పటివరకు భూమన కరుణాకర్‌రెడ్డి, ఆయన కుమారుడు అభినయ్‌రెడ్డి పంచన చేరిన కొందరు కార్పొరేటర్లు అధికారం మారడంతో కండువాలు మార్చుకునేందుకు సిద్ధమయ్యారు. అయితే అనివార్యపరిస్థితుల్లో ఆ కార్పొరేటర్లకు ప్రతిఘటన ఎదురైంది. దీంతో వారంతా స్వతంత్రులుగానే ఉన్నారు. వీరిపై ఎటువంటి చర్యలు తీసుకోలేకపోతుండటం ఆంతర్యమేమిటనేది ఇప్పుడు వైసిపి నేతల్లోనే బహిరంగంగా చర్చించుకుంటున్నారు. 20మంది కార్పొరేటర్లపై వైసిపి అధిష్టానం వేటువేస్తే కార్పొరేషన్‌లో బలం లేకపోతోందనే భయం వెంటాడుతోంది.

**మేయర్ కుర్చీపై కన్నేసిన కూటమి!:**

తిరుపతిలో ఇప్పటికే సాగుతున్న అనూహ్యపరిణామాలతో కార్పొరేషన్‌లో డిప్యూటీమేయర్ పదవిని ఆర్‌సి మునికృష్ణ (టిడిపి)చేజిక్కించుకోవడం, మరో డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ ఇప్పటికే వైసిపిని వీడి కూటమితోనే ఉండటంతో రానున్న రోజుల్లో మేయర్ కుర్చీపై కూటమి నేతలు కన్నేశారు. వైసిపి నుండి కొనసాగుతున్న మేయర్ డాక్టర్ శిరీషపై అవిశ్వాసం పెట్టాల్సి వస్తే, వీగిపోవడం ఖాయమనేది కూటమినేతల్లో విశ్వాసం.

## చెరువులో పడి యువకుడు మృతి



చెరువు వద్ద మృతదేహం కోసం గాలింపులు చేపడుతున్న అగ్నిమాపక, పోలీసు సిబ్బంది. మృతి చెందిన సెల్వకుమార్(ఫైల్‌ఫోటో)

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: మొగిలి ఘాట్ సమీప అటవీ ప్రాంతంలోని గౌనిచెరువులో ఓ యువకుడు ఈతకు వెళ్ళి మృతిచెందాడు. మృతదేహం కోసం అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు గాలింపులు చేపట్టారు. బంగారుపాళ్యం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కత్తి శ్రీనివాసులు వెల్లడించిన వివరాల మేరకు మొగిలి నందు శ్రీని ఫుడ్ పార్క్‌లో కొడరాన్ జ్యూస్ కంపెనీలు పని చేస్తున్న సెల్వకుమార్, గోపినాథ్, శరవణ, ప్రశాంత్‌లు శుక్రవారం సాయంత్రం ఈతకోసం గౌని చెరువులోకి దిగారు. తమిళనాడు రాష్ట్రం నామక్కల్‌కు చెందిన సెల్వకుమార్(27) చెరువులో దిగిన కొద్ది సేపటికే ఊపిరి ఆడక మునిగిపోయాడు. గుర్తించిన శరవణ, గోపినాథ్, ప్రశాంత్‌లు గట్టిగా కేకలు వేస్తూ ఫ్యాక్టరీకి వెళ్ళి జరిగిన విషయంను తెలిపారు. ఫ్యాక్టరీ యాజమాన్యం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎ అగ్నిమాపక కేంద్ర సిబ్బంది శుక్రవారం సాయంత్రం గౌనిచెరువు చేరుకుని మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి పడటంతో తిరిగి శనివారం మృతదేహం ఆచూకీ కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టినా సాయంత్రం వరకు ఆచూకీ తెలియరాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కత్తి శ్రీనివాసులు తెలిపారు.

## ఢిల్లీలో విజయంపై సంబరాలు



తిరుపతి(రవాణ), ఫిబ్రవరి 8ప్రభాతవార్త:

దేశరాజధాని ఢిల్లీ అసెంబ్లీలో 27 సంవత్సరాల తరువాత తిరిగి బిజెపి జెండా ఎగురవేయడం పట్ల తిరుపతిలో బిజెపి నాయకులు సంబరాలు చేసుకున్నారు. ప్రధాని మోదీ పాలనపై, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై ఢిల్లీ ప్రజలు నమ్మకంతో బిజెపికి ఓటువేసి అభ్యర్థులను గెలిపించారన్నారు .ఢిల్లీ అసెంబ్లీలో 48స్థానాలు గెలుచుకున్న బిజెపిని విజయందిశగా నడిపించిన ఢిల్లీ ఓటర్లకు తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, నాయకులు భానుప్రకాశ్‌రెడ్డి, పొనగంటి భాస్కర్ ,వరప్రసాద్, రాటకొండ విశ్వనాథ్, డాక్టర్ శ్రీహరిరావు, మునిసుబ్రమణ్యం కార్యకర్తలతో కలసి బిజెపి జెండాలు చేతబట్టి స్వీట్లు పంచుకున్నారు.

**శ్రీకాళహస్తిలో**

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

ఢిల్లిలో బిజెపి విజయం సాధించటంతో శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో రాష్ట్ర బిజెపి కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్



సారథ్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఢిల్లి గెలుపు దేశానికి మరో మలుపు అన్నారు. రాజధాని ప్రజలు సంయమనంతో సమయస్ఫూర్తితో బిజెపికి పట్టం కట్టారన్నారు. డబుల్ ఇంజన్ సర్కారుతో అభివృద్ధి సాధ్యమౌతుందని ప్రజలు నమ్మారు కాబట్టి తిరుగులేని విజయం సాధించారని ఆనంద్ అన్నారు. కార్యక్రమాల్లో కోలా ఆనంద్‌కుమార్‌తోపాటు జిల్లా కార్యదర్శి మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, బిజెపి నాయకులు కొండేటి గోపాల్, ఎస్‌వి రమణ, ఆర్. హరీష్‌రెడ్డి, వేదం కృష్ణయ్య, చిలకా రంగయ్య, సొట్ట కుమార్, బగీర్తి వెంకటేష్, కోలా గోవర్ధన్, కుప్పా ప్రసాద్, ధర్మయ్యయాదవ్, కూనాటి నాగరాజు, రాఘవులు నాయుడు, హరీష్‌మురళి, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

### శ్రీకాళహస్తీశ్వరాలయ

## పాలకమండలి కసరత్తు పూర్తి

### రిజర్వేషన్లు కులాల వారిగా జాబితా సిద్ధం
### పార్టీకి పంపిన ఎంఎల్‌ఏ



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి నియామకానికి సంబంధించిన సభ్యుల ఎంపిక కసరత్తు పూర్తి అయి పార్టీ అధిష్టానానికి పంపినట్లు సమాచారం. కూటమి ప్రభుత్వానికి సంబంధించి సర్దుబాట్లు ఉంటాయి. అయితే శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి రిజర్వేషన్ల మేరకు జాబితాను సిద్ధం చేసినట్లు సమాచారం. ఇందులో ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన గైడ్ లైన్స్ మేరకు నియోజకవర్గంలోని అందరిని కలుపుకుంటూ జాబితా సిద్ధం చేసినట్లు సమాచారం. అయితే ఈ జాబితా యథాతథంగా పార్టీ ఆమోదిస్తుందా? మార్పులు చేర్పులు చేస్తారా? అనేది వేచి చూడాలి. అయితే ఈ నెల 25న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీకాళహస్తి పర్యటనకు వచ్చే లోపల ధర్మకర్తల మండలి నియామకం జరిగేటట్లు ఎంఎల్‌ఏ పరుగులు తీస్తున్నారు. కులాల సమీకరణ, మహిళలకు 50శాతం రిజర్వేషన్లను పరిగణలోకి తీసుకొని సుధీర్‌రెడ్డి కసరత్తు చేసినట్లు సమాచారం. ఇందులో కూటమికి చెందిన నాయకుల మద్దతు దారులకు కూడా అవకాశం కల్పించినట్లు సమాచారం.

**జాబితాలో ఉన్నది వీరేనా?**

శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ఏర్పాటుకు సంబందించి శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి రూపొందించిన జాబితాలో అన్ని పార్టీల వారికి అవకాశం కల్పించినట్లు వినబడుతుంది. చైర్మెన్ పగ్గాలను రంగినేని చెంచయ్యనాయుడు (ఓసి వెలమ) పేరును ప్రతిపాదించినట్లు సమాచారం. గతంలో గోపాలకృష్ణారెడ్డి రెండుసార్లు బలిజ సామాజిక వర్గానికి మరో సారి కమ్మ సామాజిక వర్గానికి అవకాశం కల్పించారు. సుధీర్‌రెడ్డి మొదటి సారి వెలమ సామాజిక వర్గానికి అవకాశం కల్పించుటకు నిర్ణయిం చారు. సభ్యులుగా డి. లక్ష్మమ్మ (ఓసి కమ్మ)జి. గోపినాథ్(ఎస్‌సి మాదిగ) వాకచర్ల గుర్రప్పశెట్టి (ఓసి వైశ్య) ఎం. ముని రాజాయాద్, (బిసి యాదవ) కె. మల్లీశ్వ రమ్మ(ఓసి రెడ్డి), ఎం జ్యోతి (ఎస్‌టి యానాది) నెమళ్ళూరు సుబ్రమణ్యం(బిసి గాండ్ల), పోలూరు ప్రమీలమ్మ ( బిసి వన్నెకుల క్షత్రియ), ఎన్ సూరినాయుడు (ఓసి కమ్మ), ఎం సరస్వతి (బిసి వన్నెకులక్షత్రియ), కంఠారమేష్ (బలిజ ఓసి), బి. మునిలక్ష్మి(బిసి ముత్తరాశి), కె. సుహాసిని(నాయిబ్రాహ్మణ), ఎస్‌ఎంకె కృష్ణ మూర్తి గురుకుల్(బ్రాహ్మణ) కోలా విశాలక్షి( బలిజ ఓసి బిజెపి), దండి రాఘవయ్య ( బలిజ ఓసి జనసేన)ల పేర్లను పార్టీ అధిష్టానానికి అందించినట్లు సమా చారం. అయితే పార్టీ అధిష్టాన వర్గం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి. శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి అయితే అన్ని సమీకరణలను పరిగణలోకి తీసుకొని జాబితాలను రూపొందించారని చెప్పవచ్చు.

## యూరియా కోసం రైతు కటకట

### - ఇతర రాష్ట్రాలకు వెళ్ళి అధిక ధరలకు కొనుగోలు చేస్తున్న అన్నదాత




చిత్తూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:

జిల్లాలో రైతులు పంట సాగు యూరియా కోసం అల్లాడిపోతున్నారు. ఇటు రైతు భరోసా కేంద్రాలు, అటు ప్రైవేటు ఎరువుల దుకాణాల ఏజెన్సీల్లో యూరియా నిల్వ లేదంటూ స్పష్టం చేస్తుండటంతో యూరియా కోసం రైతు విలవిలలాడుతున్నాడు. జిల్లాలో ఓ నెల రోజుల నుండి యూరియా కొరతతో రైతు అల్లాడుతుంటే వ్యవసాయశాఖ మాత్రం జిల్లాలో పంటల సాగుకు అవసరమైన మేరకు యూరియా నిల్వలు పుష్కలంగా వున్నాయని ప్రకటనలు చేసి నవ్వుల పాలు అవుతోంది. రైతులు పంటల సాగుతో పాటు ఇతర అవసరాల కోసం యూరియాను అధిక మొత్తంలో వినియోగిస్తుండటంతో జిల్లాలో యూరియా కృత్రిమ కొరత కన్పిస్తోందని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాకు తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలు సరిహద్దుగా వుండటంతో ఇక్కడ యూరియా లభ్యం కాని పరిస్థితి నెలకొనడంతో రైతులు సరిహద్దులో వున్న పొరుగు రాష్ట్రాలకు వెళ్ళి ఎక్కువ మొత్తం చెల్లించి యూరియా కొనుగోలు చేసుకు రావాల్సిన పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో పంట సాగుకు రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు రైతు భరోసా కేంద్రాల్లోనే లభ్యం అయ్యేవి. ప్రస్తుత ప్రభుతం సైతం రైతు భరోసా కేంద్రాలను కొనసాగిస్తున్నప్పటికీ అందులో రైతుకు పంటల సాగుకు ఉపయోగపడే విత్తనాలు, ఎరువులు లభ్యం కాని పరిస్థితి నెలకొంది. అలాగే జిల్లాలోని ప్రైవేటు ఎరువుల దుకాణాల ఏజెన్సీల్లో సైతం యూరియా కొరత స్పష్టంగా కన్పిస్తోంది. రైతులు యూరియా కోసం ఎరువుల దుకాణాల ఏజెన్సీల వద్దకు కాళ్ళు అరిగేలా ప్రదక్షిణలు చేస్తున్నప్పటికీ లభ్యం కాని పరిస్థితి నెలకొంది. కొంత మంది ఎరువులదుకాణాల ఏజెన్సీలు రెండు మూడురోజుల క్రితం యూరియా కోసం డబ్బులు చెల్లించి రసీదుతీసుకున్న రైతులకు ప్రస్తుతం యూరియా ఇచ్చే పరిస్థితి నెలకొంది. అలాగే జిల్లాలోని అన్ని ఎరువుల దుకాణాల ఏజెన్సీలకు సైతం ప్రస్తుతం యూరియా సరఫరా కాని పరిస్థితి నెలకొంది. జిల్లాలో అక్కడక్కడ ఒకొక్క ఎరువుల దుకాణాల ఏజెన్సీకు యూరియా రావడం, దీనిని ఆ ఏజెన్సీ నిర్వాహకులు అందుబాటులో వున్న రైతులకు విక్రయించడంతో మిగిలిన రైతులు యూరియా కోసం అల్లాడే పరిస్థితి నెలకొంది. అలాగే ప్రతి మండలంలో ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో రైతు భరోసా కేంద్రం వున్నప్పటికీ ప్రస్తుతం మండల పరిధిలో ఒకటి, రెండు రైతు భరోసా కేంద్రాలకు మాత్రమే యూరియా సరఫరా అవుతుంది. ఈ సచివాలయాల పరిధిలోని రైతులకు మాత్రమే కొంత మేరకు యూరియా లభ్యం అవుతుంది. మిగిలిన రైతులు యూరియా కోసం తిప్పలు పడుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా జిల్లాలో రైతులకు అవసరమైన మేరకు యూరియా నిల్వలను సరఫరాచేసి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

**యూరియా అనేది సమస్యే కాదు: జిల్లా వ్యవసాయ అధికారి**

జిల్లాలో రైతులకు యూరియా అనేది సమస్యే కాదని, యూరియా పుష్కలంగా అందబాటులో వుంటున్నదని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ పేర్కొన్నారు. జిల్లాలో నెలకొన్న యూరియా సమస్యపై వ్యవసాయ శాఖ జెడి మురళీకృష్ణ 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ జిల్లాలో పంటల సాగుకు అవసరమైన యూరియా రైతులకు అందుబాటులో వుందని, జిల్లాకు ఈ వారంలో సైతం 2 వేల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. రైతులకు యూరియా అందుబాటులో లేకుంటే నానో యూరియా కొనుగోలు చేసి ఉపయోగించుకోవచ్చునన్నారు. యూరియా ధర కంటే నానో యూరియా ధర తక్కువ అని, యూరియా ఒక బస్తా ధర రూ.366.50 వుంటే నానో యూరియా అర్థ లీటరు ధర రూ.180 మాత్రమే అన్నారు,

## పలమనేరులో నూతన కోర్టు భవనం ప్రారంభం



సుప్రీం కోర్టు న్యాయమూర్తికి హైకోర్టు న్యాయమూర్తి మెమెంటో అందిస్తున్న దృశ్యం

పలమనేరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:

పలమనేరులో నూతనంగా రూ.15.18 కోట్లతో నిర్మించిన కోర్టు భవనాన్ని సుప్రీంకోర్టు న్యాయమూర్తి సరస వెంకట నారాయణ భట్ శనివారం ప్రారంభించారు. 4 కోర్టు భవనాలు, న్యాయమూర్తుల నివాస భవనాలను సుప్రీంకోర్టు న్యాయమూర్తి సరస వెంకట నారాయణ భట్, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకుర్ లు ప్రారంభించారు. ఈ మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావ్, చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు వారిని ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి సరస వెంకట నారా యణ భట్ మాట్లాడుతూ 10 సంవత్సరాలలో సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా పలు కోర్టు భవనాలను ప్రారంభించాను. అయితే మదనపల్లె, పలమనేరు కోర్టులను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. పలమనేరులో గతంలో చిన్న గదులలో ప్రజలకు న్యాయ పరిష్కారం జరిగేదని నేడు నూతన భవనం నిర్మాణం జరగడం ఆ భవనాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. న్యా యవాదులు నూతన ఉత్సాహన్ని పెంపొందించడానికి, ప్రజలకు న్యాయ వ్యవస్థపై నమ్మకం కలిగించడంలో భాగంగా స్వయంగా ఈ కార్యక్రమానికి తాను హాజరుకావడం జరిగిందన్నారు. సమస్యలతో వచ్చే ప్రజలకు న్యాయం అందించి ప్రజలకు న్యాయ వ్యవస్థపై నమ్మకం కలిగించాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉందన్నారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తిలు బి. కృష్ణ మోహన్, టి. సి. డి శేఖర్, తిరుమతి మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి గురునాథ్, చిత్తూరు అడిషనల్ సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎస్. పి. డి వెన్నెల, డి ఎల్ ఎస్ ఏ సెక్రటరీ భారతి, పలమనేరు సివిల్ కోర్టు న్యాయమూర్తి ఆది నారాయణ, సివిల్ కోర్టు న్యాయమూర్తి లిఖిత, స్పెషల్ కోర్టు న్యాయమూర్తి రాధమ్మ, ఆర్డీఓ భవానీ, ఏపి బార్ కౌన్సిల్ చైర్మన్ నల్లారి ద్వారక నాథరెడ్డి, పలమనేరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లక్ష్మీపతి, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలకు అతీతంగా సమస్యల పరిష్కారం

### - ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త



సూళ్లూరుపేట నియోజకవర్గంలో సమస్యలను పార్టీలకు అతీతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శనివారం స్థానిక రైల్వేగేటు వద్ద ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆమె ప్రజావిజ్ఞప్తుల దినంలో పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల నుంచి వస్తున్న వినతులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు తనవంతు ప్రయత్నాలు చేస్తానని అన్నారు. ఇందులో భాగంగా పార్టీలతో పనిలేకుండా ఎవరికైనా సాయం అందించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఉన్న రోడ్లు, పెన్షన్లు, మౌలిక సదుపాయాలు, ఇతర వ్యక్తిగత సమస్యలపై వచ్చిన వినతిపత్రాలను పరిశీలించి వాటికి వీలైనంత త్వరలో పరిష్కారం చూపుతామని నెలవల విజయశ్రీ చెప్పారు. నియోజకవర్గంలో ఆరు మం డలాలకు సంబంధించి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు శ్రమించాలని ఆమె తెలిపారు. దొరవారిసత్రం మండలం పూలతోటకు చెందిన వేలూరు రూపేష్ ఇటీవల మృతిచెందారు. పార్టీ తరపు నుంచి రూ.5 లక్షలు చెక్కును అతని కుమారుడు పవన్‌సాయికి అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, పార్టీ నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, మాధవనాయుడు, వేమసాని శ్రీనివాసులునాయుడు, వేలూరు మురళీకృష్ణారెడ్డి, వాకిచర్ల రమేష్, మేడా సాయి, ఎజి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ నులిపురుగుల నివారణ పోస్టర్లు ఆవిష్కరణ

యాదమరి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:

జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వహించతలపెట్టిన జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమ పోస్టర్లను శనివారం యాదమరి పిహెచ్‌సి సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిహెచ్‌ఓ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ చిన్నారుల్లో రక్తహీనతను కట్టడి చేయడానికి ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈ కార్యక్రమంను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. 10వ తేదీ ఉదయం అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు నులిపురుగుల నివారణకు డీవార్మింగ్ మాత్రలు మింగించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన మాత్రలను ఆయా పాఠశాలలకు అందించడం జరిగిందని, ప్రతి ఒక్కరు మాత్రలు వేసుకొనేలా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. అలాగే హ్యాండ్ వాషింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించి ఆ రోజు మధ్యాహ్న భోజనం అనంతరం వారికి డీవార్మింగ్ మాత్రలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు లక్ష్మీపతి, సెల్వరాణిలు, ఎంఎల్‌హెచ్‌పిలు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఢిల్లీలో బిజెపి విజయంపై సంబరాలు

గుడిపాల, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:



ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి విజయం సాధించడంతో మండల కేంద్రం గుడిపాలలో శనివారం బిజెపి మండల పార్టీ అధ్యక్షురాలు రమ అధ్వర్యంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడి నేతృత్వంలో భారతదేశం ప్రపంచ దేశాల్లో కెల్లా అన్ని రంగాల్లో అగ్రగామిగా దూసుకువెళ్తున్నదన్నారు. దేశ అభివృద్ధిని చూసి ఢిల్లీ ప్రజలు బిజెపికి పట్టం కట్టారన్నారు. భవిష్యత్తులో సైతం ప్రధాని నరేంద్రమోడి నేతృత్వంలో బిజెపి మరిన్ని విజయాలను కైవసం చేసుకోనుందన్నారు. ఈ సందర్భంగా టపాకాయలు పేల్చి నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సోమనాథ్‌గౌడ్, చిట్టిబాబు, సుభాష్, గోపి, దేవా, శరవణ తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ ఎన్నికల్లో బిజెపి చారిత్రాత్మక విజయం

– జిల్లా బిజెపి అధ్యక్షులు జగదీశ్వర్‌నాయుడు, చిట్టిబాబు కొల్లా

చిత్తూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:



ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి చారిత్రాత్మక విజయం సాధించిందని జిల్లా బిజెపి అధ్యక్షులు జగదీశ్వర్‌నాయుడు, జిల్లా బిజెపి సీనియర్ నాయకులు చిట్టిబాబు కొల్లాలు పేర్కొన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి విజయం సాధించడంతో శనివారం జిల్లా బిజెపి అధ్యక్షులు జగదీశ్వర్‌నాయుడు, సీనియర్ నాయకులు చిట్టిబాబు కొల్లాల ఆధ్వర్యంలో చిత్తూరు గాంధీ విగ్రహం ఆవరణలో బిజెపి నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవినీతి, లిక్కర్ స్కామ్‌లు ఆప్ ప్రభుత్వంను కూలదోసిందన్నారు. ఢిల్లీ ప్రజలు ప్రజాస్వామ్య పరిపాలన, డబుల్ ఇంజన్ సర్కార్‌ను కోరుకున్నారన్నారు. మాజీ ఎంపి దుర్గారామకృష్ణ మాట్లాడుతూ వికసిక ఢిల్లీ సంక్షేమ ప్రభుత్వానికి ప్రజలు మద్దతు పలికారన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు అట్లూరి శ్రీనివాసులు, రాజేంద్రనాయుడు, రవికుమార్, రామ్‌భద్ర, మోహన్‌నాయుడు, రెడ్డి మస్తాన్, షంషేర్, బాబు పాండియన్, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మి నరసింహస్వామికి ప్రత్యేక పూజలు

కల్లూరు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త



పులిచర్ల మండలం దేవలంపేట శ్రీ లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో 20 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మాఘ మాసం ఏకాదశి శనివారం ఉత్తరాయణం స్వామివారి ప్రాణ ప్రతిష్ట జరిగిన రోజున స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, గోపూజ. పంచామృత అభిషేకం, పసుపు, గంధం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. లక్ష్మినారాయణ హోమం. శ్రీ లక్ష్మి నరసింహ హోమం జరిపారు స్వామి వారికి అర్చనలు చేసి నైవేద్యం సమర్పించి పూర్ణాహుతి జరిపారు. మధ్యాహ్నం ఆలయ ప్రధాన అర్చకులు అనంత కుమారాచార్యులు స్వామివారి కల్యాణోత్సవాన్ని వేదమంత్రాలతో వైభవంగా జరిపించారు. ఉభయ దారులు గడ్డంవారిపల్లికి చెందిన నవీన్ కుమార్, కార్తీక్ కుమార్, భక్తులకు అన్న ప్రసాద వితరణ గావించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకుని కళ్యాణోత్సవాన్ని కనులారా తిలకించారు.

## గోనుమాకులపల్లిలో కుష్టువ్యాదిపై వైద్యశిబిరం ఏర్పాటు

పెద్దపంజాణి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:



మండలంలోని గోనుమాకులపల్లిలో మండలవైద్యాదికారి డాక్టర్ మురళీ శనివారం కుష్టువ్యాధిపై వైద్యశిభిరాన్ని నిర్వహించారు. కుష్టువ్యాది లక్షణాలు వాటి సంక్రమణ తీరును వివరించారు. పోషకాహారలోపము, రక్తహీనత, వ్యకితగత పరిశుభ్రత తదితారాలు వివరించడంతోపాటు చర్మవ్యాదులు క్యాన్సర్ కుష్టువ్యాదిపై అవగాహన కల్పిం చారు. శరీరంపై ఎలాంటినోప్పి,స్పర్శలేకుండా మచ్చ లు ఏర్పడివుంటే తమదృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. సరైన సమయంలో గుర్తించి చికిత్స అందిస్తే నయమౌతుందని ప్రజలు భయాందోలన చెందాల్సిన అవసరంలేదని ఆయన పేర్కొన్నారు. అనంతరం పలువురికి మందులు, మాత్రలు ఉచితంగా పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



## ఢిల్లీ విజయం నరేంద్ర మోడీ అంకితం

పుంగనూరు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త

సుదీర్ఘ విరమణ అనంతరం భారతదేశ రాజధాని ఢిల్లీ పీఠం పైన బిజెపి విజయకేతన ఎగరవేసిందని, ఆలస్యమైనప్పటికీ ఢిల్లీ ప్రజలు దేశభక్తికి ఓటు వేశారని ఇది చారిత్రక సమయమని బిజెపి నియోజకవర్గ అధ్యక్షుడు గన్న మదన్ మోహన్ బాబు అభినందించారు. ఢిల్లీలో బిజెపి విజయోత్సవ సభల్లో పాల్గొనేందుకు వెళ్లిన ఆయన ఢిల్లీ నుంచి మాట్లాడుతూ భారత దేశంలో కొన్ని కుహనా పార్టీలు దేశభక్తులను దేశ గొప్పతనాన్ని 70 ఏళ్లుగా కించపరిచి మరుగునపెట్టి ప్రజలకు దుర్మార్గులు గురించి మాత్రమే వివరించారన్నారు. ఢిల్లీలో బిజెపి విజయానికి చిహ్నంగా పుంగనూరులో త్వరలో విజయ స్తూపం ఏర్పాటు చేస్తామని ఆయన వివరించారు.

## వెలగని వీధి దీపాలు:

**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి పురపాలక సంఘ పరిధిలోని ఓ వీధిలో సుమారు నెల రోజులుగా వీధి దీపాలు వెలగక ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సమాచారం. ఈ సమస్యను ఎన్నో సార్లు వార్డు ప్రజలు మున్సిపల్ అధికారుల దృష్టికి తెచ్చినా పట్టించుకోలేదని వాపోతున్నారు. పట్టణ నడిబొడ్డులోని నగార్చిపాళెంలో చిమ్మచీకట్లు కమ్ముకున్నాయన్నారు. రాత్రి వేళల్లో గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తూ ఆందోళన కల్గిస్తున్నారని వాపోయారు. మున్సిపల్ అధికారులు స్పందించి వీధి దీపాలను వెలిగించాలని కోరుతున్నారు.

## కుప్పం,శాంతిపురంలో కూటమి నేతల సంబరాలు

కుప్పం/శాంతిపురం/రామకుప్పం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త





దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించడంతో కుప్పం, శాంతిపురం,రామకుప్పంలలో ఎన్డీయే కూటమి నేతలు ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. కుప్పం బస్టాండు, శాంతిపురం, రామకుప్పంలో పెద్ద ఎత్తున టపాకాయలు కాల్చి మిఠాయిలు పంచారు. ప్రధాని మోడీ నేతృత్వంలో ఢిల్లీ పీఠాన్ని దక్కించుందని దేశవ్యాప్తంగా బిజెపికి తిరుగులేదని నేతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తులసినాథ్, కాశీనాథ్, రాజసింహ, ఆంజనేయులు, నేతలు నితీష్, వడివేలు, గజేంద్ర, రామచంద్రుడు, నాగరాజు, కమలనాథ్‌రెడ్డి, అమరనాథరెడ్డి, శ్రీధర్, ముతు ్వేలు, జనసేన నరేష్, కిషోర్, సుబ్రమణ్యం, రమేష్, మంజునాథ్‌కుమార్, శివకుమార్ వర్మ,గోపి, మురళి, ఆనంద్, బిఎం హరి, గోవిందు పాల్గొన్నారు.

## ఉచిత కంటి ఆపరేషన్లకు 15మంది ఎంపిక

కుప్పంరూరల్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త



కుప్పం లయన్స్‌క్లబ్, పిఇఎస్ ఆస్పత్రి అధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంకు విశేష స్పందన లభించింది. సుమారు వందమంది ఈ శిబిరంకు హాజరు కాగా వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి వారిలో 15మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సలహాదారు మహేష్, జిఎన్ రమేష్, సభ్యులు పిజి సెల్వం, మధుసూధన్, కృష్ణమూర్తి, నాగరాజ్, శివప్రసాద్, ఏకాంబరం, ధనశేఖర్, సీతారాం పాల్గొన్నారు.

## నేటినుంచి తెదేపా మండల సర్వసభ్య సమావేశాలు

కుప్పం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గంలో ఆదివారం నుంచి ఈనెల 13వతేది వరకు మండల తెలుగుదేశం పార్టీ సర్వ సభ్య సమావేశాలు నిర్వహించనున్నారు. 9వతేది ఆదివారం కుప్పం మున్సిపల్ పార్టీ సమావేశం కుప్పం తెదేపా కార్యాలయంలో జరుగుతుంది. అలాగే 10వతేది కుప్పం గ్రామీణ మండల పార్టీ సమావేశం కుప్పంలోనే జరగనుంది. ఈనెల 11న రామకుప్పం, 12న శాంతిపురం, 13న గుడుపల్లె మండల పార్టీ సమావేశాలు జరుగుతాయి. సమావేశంలో పార్టీ స్థితిగతులు, త్వరలో జరగనున్న సంస్థాగత ఎన్నికలతో పాటు జన నాయకుడు పోర్టల్‌పై నేతలు, కార్యకర్తలకు అవగాహన కల్పించడం జరుగుతుంది.

## వసనాడు ఈద్గాకు 10లక్షలతో నూతనంగా రోడ్డు

కుప్పంరూరల్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త



మండలంలోని పంచాయతీ కేంద్రమైన వసనాడు గ్రామంలో ఉన్న ముస్లింల ఈద్గాకు దారి సౌకర్యం లేక ముస్లింలు గత కొన్నేళ్లుగా ఇబ్బందులు పడే వారు. ఈ నేపథ్యంలో సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ఈద్గాకు నూతనంగా రోడ్డు నిర్మాణంకు 10లక్షలు మంజూరు కావడంతో శనివారం మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ పనులను భూమిపూజ చేసి ప్రారంభించారు. ముస్లింలతో పాటు అన్ని వర్గాలకు న్యాయం చేసేది సిఎం చంద్రబాబునాయుడేనని ఆయన పేర్కొన్నారు. ఈసందర్భంగా ఈద్గా వద్ద సిఎం చంద్రబాబునాయుడుకు అంతా మంచి జరగాలని ముస్లింలతో కలసి దువా చేశారు. కార్యక్రమంలో నేతలు వల్లెప్ప, మహేంద్ర, శరవణ, చరణ్, సుబ్బు, శివ, రియాజ్, బాబు, పటేల్ బాబుసాహెబ్, ముత్యాల్లి అమీర్ తదితరులు పాల్గొన్నారు

## రైతులకు డిజిటల్ గుర్తింపు కార్డులు

శాంతిపురం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

రైతులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు డిజిటల్ గుర్తింపు కార్డులు మంజూరు చేయనున్నట్లు వ్యవసాయాధికారి అప్పోజి తెలిపారు. ఇందుకోసం రైతులు ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ లింక్ అయిన ఫోన్ నెంబరును తీసుకుని రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సహాయకుల ద్వారా ఈనెల 28వతేది లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పంటభీమా, పిఎంకిసాన్ యోజన, పంటనష్ట పరిహారం, అన్నదాత సుఖీభవ, యంత్రాలపై రాయితీల కోసం రైతులకు డిజిటల్ గుర్తింపు కార్డులు తప్పనిసరి అని తెలిపారు.

## 23న గంటా కమలమ్మ సాహితీ పురస్కారం

చిత్తూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:

చిత్తూరు విజయం డిగ్రీ కళాశాలలోని సమావేశభవనంలో ఈ నెల 23వ తేదీ ఉదయం 9 గంటలకు గంటా కమలమ్మ సాహితీ పురస్కార ప్రదాన కార్యక్రమం జరుగుతుందని గంటా కమలమ్మ సాహితీ పురస్కార ట్రస్ట్ నిర్వాహకులు గంటామోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. గంటా కమలమ్మ స్మారక కవితా పురస్కారం–2024 కోసం నిర్వహించిన పోటీకి ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి 35 కవితా సంపుటాలు అందాయని, దీనికి న్యాయ నిర్ణేతలుగా ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ రాధేయ(అనంతపురం), డాక్టర్ రఘు(హైదరాబాదు) వ్యవహరిస్తారన్నారు. ఈ పురస్కారానికి 'నాలుగు రెక్కల పిట్ట' సాంబమూర్తి లండ శ్రీకాకుళం, 'చింతలతొవ్వ' తుల శ్రీనివాస్ నల్గొండకు చెందిన కవితా సంపుటాలు ఎంపికయ్యాయన్నారు. పురస్కార గ్రహీతలకు 10 వేల రూపాయల నగదుతో పాటు జ్ఞాపికలతో సత్కరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## ప్రతి శనివారం ఎమ్మెల్యే మురళీమోహన్ ప్రజా దర్బార్

చిత్తూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:

పూతలపట్టు అసెంబ్లీ నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిశీలించి పరిష్కరించడానికి పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ ప్రతి శనివారం మధ్యాహ్నం 2 గంటల నుండి చిత్తూరు లక్ష్మీనగర్‌కాలనీలోని పూతలపట్టు ఎమ్మెల్యే కార్యాలయంలో గ్రీవెన్స్‌డే కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి పూతలపట్టు నియోజకవర్గాల పరిధిలోని మండలాల ప్రజలు తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించుకోవచ్చును.

## వెదురుకుప్పం పంచాయితీలో జోరుగా పారిశుద్ధ్య పనులు

– ఆదర్శ పంచాయితీగా తీర్చిదిద్దుతాం సర్పంచ్ శిల్పారామయ్య

వెదురుకుప్పం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :



మండల కేంద్రమైన వెదురుకుప్పం పంచాయితీలో శనివారం సర్పంచ్ శిల్పా రామయ్య ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పంచాయితీని అన్నివిధాలుగా అభివృద్ధి పథంలో నడిపి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ఉదయం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయం పరిధిలోని రోడ్డుకు ఇరువైపుల ఉన్న పిచ్చి మొక్కలు తొలగింపుకు జెసిబితో పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ భారతం మిట్ట, చవటగుంట, తహశీల్దార్, ఎంపిడివో కార్యాయాల పరిధిలో మురుగునీటి కాలువలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే చవటగుంట కూడలిలో వాణిజ్య సముదాయం గదులు, మంచినీరు సరఫరాకు మినరల్ వాటర్ ప్లాంటులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పంచాయితీని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నడిపి ఆదర్శ పంచాయితీగా తీర్చిదిద్దడంకు కృషి చేస్తామన్నారు. పంచాయితీ పరిధిలో వంద శాతం పారిశుద్ధ్య పనులు పూర్తి చేస్తామన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఆక్రమణలను తొలగించిన అధికారులు



**పుంగనూరు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త** పట్టణంలోని కౌండిన్య నది స్థలాన్ని ఆక్రమించి ఏర్పాటు చేసిన రేకుల షెడ్డును మున్సిపల్ అధికారులు శుక్రవారం తొలగించారు. ఈ కార్యక్రమం రెవెన్యూ, మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఆక్రమణలను గుర్తించారు. పోలీసుల రక్షణ మధ్య వీటిని తొలగించారు. ప్రభుత్వ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ప్రజలు అధికారులకు సహకరించాలన్నారు.

## అఖండ భారత్ సాధన దిశగా బిజెపి

– టీవీఎస్ ప్రసాద్ బాబు ఉద్ఘాటన

పుంగనూరు, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త



దేశం అన్ని రాష్ట్రాల్లో పరిపూర్ణంగా భారతీయ జనతా పార్టీ విజయకేతనం ఎగురవేస్తూ దేశ రాజధాని ఢిల్లీలో కూడా అఖండ విజయం సాధించిందని బిజెపి సీనియర్ నాయకుడు టీవీఎస్ ప్రసాద్ అభినందించారు. శనివారం ఉదయం పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్లో జరిగిన బిజెపి సంబరాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో అఖండ భారత దిశగా బిజెపి ప్రయాణం సాగుతుందని అన్నారు. ఢిల్లీలో బిజెపి పార్టీ అఖండ విజయం సాధించి ఢిల్లీ పీఠాన్ని కైవాసం చేసుకోవడంతో బిజెపి పట్టణ అధ్యక్షుడు జగదీష్ రాజు ఆధ్వర్యంలో బాణసంచా పేలుస్తూ బిజెపి శ్రేణులు శనివారం సంబరాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ అవినీతిలో కూరుకుపోయిన పార్టీని ప్రజలు తగు రీతిలో బుద్ధి చెప్తారన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింహులు,అయూబ్ ఖాన్,నానా బాల కుమార్, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## రాజనాలబండకు చేరిన ఆసుపత్రి పంచాయతీ

–బంగారాన్ని దొంగలించిన వైనం –ప్రమాణాలు చేసిన సిబ్బంది



చౌడేపల్లి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

ఆసుపత్రిలో దొంగలు పడి ఎఎన్ఎం బంగారు ఉంగరాలను ఎత్తుకెళ్ళిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆ పంచాయతీని రాజనా బండ ప్రమాణానికి రావడంతో దొంగతనం విషయం బయటపడింది. స్థానిక ఆరోగ్యం కేంద్రంలోని ఎఎన్ఎం గర్భవతికి పురుడు పోసే నిమిత్తం తన చేతులకున్న రెండు బంగారం ఉంగరాలను తీసి పక్కనబెట్టింది. ఆ తర్వాత పనిలోపడి వాటిని అక్కడే మరచింది. బంగారాన్ని పెట్టిన విషయాన్ని మరచిన ఆమె 4రోజుల తర్వాత గుర్తుకు తెచ్చుకొని వెతుకగా అక్కడ తన ఉంగరాలు కనిపించలేదు. దీంతో అందరినీ విచారించగా లాభం లేకపోవడంతో రాజనాలబండను ఆశ్రయించింది. నెలరోజులుగా జరుగుతున్న తంతుకు శనివారంతో ముగింపు పలికారు. రకరాల కారణల మధ్య ఆగిన ప్రమాణాన్ని ఎట్టకేలకు రాజనాబండకు బంగారాన్ని తీసుకోలేదని ప్రమాణం చేసారు. దీంతో నెల రోజులుగా ఆసుపత్రిలో జరుగుతున్న పలు నాటకీయ పరిణామాలకు తెరతీసినట్లైంది.

## చెన్నకేశాలయంలో భీష్మ ఏకాదశి పూజలు

చౌడేపల్లి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త



మండలంలోని పంచాయతీ కేంద్రం చారాలలో గల శ్రీదేవీ, భూదేవీ సమేత చెన్నకేశవ ఆలయం లో భీష్మ ఏకాదశి పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వేదపండితుడు అగ్రహారం ఆనం దా చార్యుల ఆధ్వర్యంలో ఉదయాన్నే స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు గావించారు. అనంతరం వివిధ రకాల పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఉభయదారులచే భక్తులకు పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## రెండు ద్విచక్ర వాహనాలు ఢీ : ఒకరికి గాయాలు

చౌడేపల్లి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త



రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనగా ఒకరికి గాయాలైన సంఘటన శనివారం చౌడేపల్లిలో చోటు చేసుకొంది. చౌడేపల్లి–పరికిదొన ప్రధాన రహదారిలో పరికిదొన నుంచి చౌడేపల్లికి వస్తున్న ద్విచక్రవాహనాన్ని తెల్లనీళ్ళపల్లికి కొంత దూరంలోగల మలుపు వద్ద మరొక టూవీలర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో పంచాయతీ కేంద్రం ఆమినిగుంటకు చెందిన రాజేష్(28)కు గాయాలయ్యాయి. గాయపడ్డ అతన్ని స్థానిక ఆరోగ్య కేంద్రానికి తీసుకురాగా ఆరోగ్య పరిస్థితి విషమించడంతో పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## గుడుపల్లె మద్యం షాపుకు 16 దరఖాస్తులు

కుప్పం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

గీత కులానికి చెందిన ఈడిగ కులస్తులకు రాష్ట్ర ప్రభుత్వం గుడుపల్లె మండలంలో ఓ మద్యం షాపు కేటాయించిన విషయం విదితమే. ఈ షాపుకు దరఖాస్తుల గడువు శనివారంతో ముగిసింది. శనివారం సాయంత్రం ఐదు గంటల దాకా 16 దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్ సిఐ నాగరాజ తెలిపారు. కాగా ఈనెల 10వతేది చిత్తూరులో జిల్లా కలెక్టర్ సమక్షంలో గీత కులాల షాపులకు సంబంధించి లక్కీడ్రాను తీయనున్నారు.

## అర్హులందరికీ పథకాల్లో లబ్ది కలిగేలా చర్యలు

– మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్

కుప్పం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త



కుప్పం మున్సిపల్ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల్లో లబ్ది కలిగేలా ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నంలతో చర్చించి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం నాయీ బ్రాహ్మణ కులసంఘ నేతలు ఆయనను కలిశారు. వారు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులకు బిసి కార్పొరేషన్ రుణాలు అందేలా చూడాలని కోరారు. అలాగే అర్హులకు పక్కా ఇళ్ల మంజూరు చేయడంతో పాటు పెన్షన్లు సైతం మంజూరు చేయించాలని కోరారు. దీనిపై స్పందించిన ఆయన అర్హులకు తప్పక లబ్ది కలిగిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘ నేతలు హరి, జ్యోతీష్, మణి, దేవా, గిరి, సునీల్ పాల్గొన్నారు.

## బిసీ రుణ దరఖాస్తుల గడువు పెంపు

చిత్తూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:

బిసీ కార్పొరేషన్ ద్వారా పంపిణీ చేయనున్న సబ్సిడీ రుణాల దరఖాస్తు గడువును ఫిబ్రవరి 12వ తేదీ వరకు పెంచినట్లు బిసీ కార్పొరేషన్ ఇడి శ్రీదేవి తెలిపారు. రుణాల కోసం అర్హులైన నిరుద్యోగ యువత స్వయం ఉపాధి యూనిట్ల స్థాపన కోసం ఈ నెల 12వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

## అంబేద్కర్ భవన్‌పై అసత్యపు ప్రచారం మానుకోండి

*తిరుపతి విద్య, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త*



దళితులకు ఆశ్రయంగా నిలుస్తున్న శ్రీ చెల్లప్ప మేస్త్రి మెమోరియల్ అంబేద్కర్ భవన్ పై అసత్యపు ఆరోపణలు మానుకోవాలని తిరుపతి అంబేద్కర్ భవన్ చైర్మన్ డాక్టర్ పరమశివన్ హెచ్చరించారు. స్థానిక బాలాజీ కాలనీలోని అంబేద్కర్ భవన్ లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏపీ ఎస్సీ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగిశెట్టి ధర్మయ్య తిరుపతి అంబేద్కర్ భవన్ పై విమర్శలు చేయడం తగదన్నారు. కొందరు దుర్బుద్ధితో అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. ప్రతి నెలలో రెండుసార్లు అంబేద్కర్ ఎలా ప్రజలకు సేవ చేశారు అనే అంశాలను ప్రజల నిరంతరం తెలియజేస్తూ, అందరికీ అండగా ఉంటున్నామని తెలిపారు. అసత్యపు ఆరోపణలు మానుకొని అంబేద్కర్ భవన్ అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ సమావేశంలో అంబేద్కర్ భవన్ కార్యదర్శి కె.నాగేశ్వరరావు, సభ్యులు ఇంద్రముని, గోపి, పుష్పరాజ్ పాల్గొన్నారు.

## అమ్మా... న్యాయం చేయండి...!

తిరుపతి విద్య, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త



పశువైద్య విద్యార్థులకు అందిస్తున్న గౌరవవేతనం దారుణంగా ఉందని,వెంటనే పెంచి తగిన న్యాయం చేయండి అమ్మా...అంటూ వెటర్నరీ జూడాలు బీసీ సంక్షేమ శాఖామంత్రి సవితకు విన్నవించారు.ఈ మేరకు శనివారం తిరుపతి పద్మావతి అతిథిగృహంలో వెటర్నరీ జూడాలు మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతుల కన్నీరు తుడిచి వారి సంక్షేమం కోసం పాటుపడుతున్న తమపై ప్రభుత్వ, వర్సిటీ అధికారులు వివక్షచూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంబీబీఎస్,హోమియోపతి, అల్లోపతి,డెంటల్, ఆయుర్వేదిక్ విద్యార్థులకు ఇస్తున్న గౌరవవేతనానికి సమానంగా తమకు స్టైఫండ్ అందించాలని కోరారు.గత 6 రోజులుగా వర్సిటీలో నిరవధిక సమ్మె చేస్తున్న వర్సిటీ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. మంత్రికి తమ న్యాయపరమైన సమస్యను వివరించామని, సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వెటర్నరీ వైద్యవిద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భావిభారతానికి ఉత్తమ పౌరులను అందించడమే లక్ష్యం

తిరుపతి విద్య, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త



దేశానికి ఉత్తమ పౌరులను అందించడమే ఎస్ఆర్ విద్యాసంస్థల లక్ష్యమని ఆ దిశగా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు ఆ సంస్థల అధినేత చలమకుంట శంకర్ రెడ్డి పేర్కొన్నారు.స్థానిక కచ్చపీ ఆడిటోరియంలో ఎస్ఆర్ విద్యాసంస్థల 8వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన ప్రైవేటు కళాశాల అసోసియేషన్ అధ్యక్షులు,నలంద విద్యాసంస్థల అధినేత ఓబుల వెంకటరెడ్డితో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ అకడమిక్ విద్యతో పాటు, స్పోర్ట్స్, సైనిక్ శిక్షణ వంటి అన్ని రంగాలలో తమ విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చేందుకు సంస్థ సిబ్బంది, ఉపాధ్యాయులు కృషి చేయడం అభినందనీయమన్నారు. అనంతరం ఎస్ఆర్ విద్యాసంస్థల డైరెక్టర్ ప్రవీణ, అతిథులతో కలసి అకడమిక్ విద్యతో పాటు పలు విభాగాలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు వీక్షకులను అలరింపజేశాయి.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పసుపు రంగు సంబరాలు

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 8 ప్రభాతవార్త




పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలనందు శనివారం చిన్నారులచే పసుపు రంగు సంబరాలను ఘనంగా నిర్వహించారు. కరస్పాండెంటెంట్ సి. మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు పాఠశాల యాజమాన్యం చిన్నారులకు పసుపు రంగు యొక్క ప్రాముఖ్యతను వివరించారు. పసుపు రంగుకు సంబంధించిన పలు రకాల వస్తువులైనటువంటి పండ్లు, కూరగాయలు, పువ్వులను తీసుకొచ్చి చక్కగా ప్రదర్శించారు. కార్యక్రమాల్లో ప్రీప్రైమరీ ఇన్‌చార్జి శ్రీలత, ఎల్‌కెజి టీచర్ ముక్సాన్, సుమతి, యుకెజి టీచర్ శశికళ, హైస్కూల్ ఇన్‌చార్జి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

## రీవాల్యుయేషన్ ఫలితాలను వెంటనే విడుదల చేయాలి

తిరుపతి విద్య ఫిబ్రవరి 8 ప్రభాత వార్త



ఎస్వీయూ పరిధిలో డిగ్రీ, పీజీకి సంబంధించిన రీవాల్యుయేషన్ ఫలితాలను వెంటనే విడుదల చేయాలని గిరిజన నవసమాజ్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పాలిత్య శివ శంకర్ నాయక్ డిమాండ్ చేశారు.ఈ మేరకు శనివారం ఆయన రిజిస్ట్రార్ భూపతినాయుడును కలసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పలు సెమిస్టర్ పరీక్షల ఫలితాలపై రీవాల్యుయేషన్కు దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నా ఇంతవరకు ఫలితాలను విడుదల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్సిటీ అధికారులు ఒక్కో పేపరు రూ.2వేలు చొప్పున చలానాలు కట్టించుకుని ఫలితాలను విడుదల చేయకుండా నిర్లక్ష్యం వహించడం దారుణమన్నారు. మళ్లీ సంబంధిత సబ్జెక్ట్ పరీక్షలు వచ్చేవరకు రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేయకపోవడం సమంజసమేనా అంటూ ప్రశ్నించారు. వర్సిటీ పరిపాలనా భవనంలో అలసత్వంతో పాటు అక్రమాలకు రాజ్యమేలుతున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్ నాయక్, బాలు నాయక్, మున్నా, ప్రశాంత్ నాయక్, దిలీప్ పాల్గొన్నారు

## కేవీబీ పురం మండల వైసీపీ పార్టీ కన్వీనర్‌గా గవర్ల కృష్ణయ్య

కేవీబీ పురం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:

వైసీపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలతో కేంద్ర పార్టీ కార్యాలయం కన్వీనర్ల నియామకం చేపట్టిన నేపథ్యంలో కేవీబీ పురం మండల వైసీపీ పార్టీ కన్వీనర్‌గా రెండో సారి గవర్ల కృష్ణయ్య నియమితులయ్యారు. వరుసుగా రెండో సారి కన్వీనర్‌గా ఆయన నియమితులు కావడంతో మండలంలో పార్టీ నేతలు, అభిమానులు సంబరాలు చేసుకున్నారు. కృష్ణయ్య కాంగ్రెస్ పార్టీలో, వైసీపీ పార్టీలోను ఉన్నత పదవులు అలంకరిస్తూ అంచెలంచెలుగా ఎదుగుతున్నారు. కృష్ణయ్య నియామకాన్ని పలువురు స్వాగతిస్తూ అభినందించారు.

## ఎంఎల్‌ఏ అభ్యర్థనను గౌరవించి బోర్డులు తొలగింపు

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 8 ప్రభాతవార్త




శ్రీకాళహస్తిలోని నాలుగుమాడావీధుల్లోని రోడ్డు ఆక్రమణలను తొలగించుకోవాలని శుక్రవారం శాసనసభ్యులు బొజ్జల సుధీర్‌రెడ్డి ఇంటింటికి దుకాణం దుకాణానికి వెళ్ళి వ్యక్తిగతంగా అభ్యర్థించారు. ఆయన అభ్యర్థన మేరకు నాలుగుమాడావీధుల్లో దుకాణం దారులు ఎవరికి వారు బోర్డులను తొలగించుకుంటున్నారు. కొందరు తమ దుకాణాల ఎదుట బోర్డులను రోడ్డుమీదకు విస్తరించే విధంగా ఏర్పాటు చేసుకున్నారు. రథోత్సవం సందర్భంగా ఇబ్బంది లేకుండా ఎవరికి వారు తొలగించుకోవాలని కోరారు. నాలుగుమాడావీధుల్లో సుమారు 3గంటల పాటు ఆయన అధికారులతో కలసి పరిశీలించారు. బోర్డులను మాత్రం తొలగించుకోవాలని కోరారు. ఈ మేరకు దుకాణం దారులు కొంత వరకు వెనక్కు జరిగారు. విద్యుత్‌శాఖ విద్యుత్ పిల్లర్లు, దేవస్థానం విద్యుత్ స్థంభాలను ఏర్పాటు చేసి ఉన్నారు. వాటిని హద్దుగా తొలగించుకున్నారు.

## చిదంబరేశ్వర పీఠాధిపతి ఆశీర్వచనం

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 8 ప్రభాతవార్త



దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో వవెలసిన వాయులింగేశ్వరుని దర్శనార్థం భారతదేశంలోని నలుమూలల్లోంచి పీఠాధిపతులు విచ్చేస్తున్నారు. శనివారం తమిళనాడులోని తిరు మంగళం చిందంబరేశ్వర ఆలయ పీఠాధిపతి ఆదినా గణష్ స్వామి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. సాంబ్రాణి స్వామి నిర్మించిన సుబ్రమణ్యం స్వామి ఆలయాన్ని సందర్శించుకున్నారు. ఆయన్ను శ్రీకాళహస్తీశ్వరాలయ మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు కలసి ఆశీర్వచ నాలు పొందారు. ఆయనతో పాటుగుమ్మడి బాలకృష్ణ,స్వయంభువు సాంబ్రాణి స్వామి,జీవా పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు సహకరించండి: రాత్రి వేళల్లో సంచరించవద్దు

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 8 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో రాబోవు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శాంతి భద్రతలను కాపాడుటకు ప్రతి ఒక్కరు సహకరించాలని డివైయస్‌పి నరసింహామూర్తి పిలుపు నిచ్చారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డివైయస్‌పి నరసింహామూర్తి, సిఐలు డి.గోపి,వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎక్కడ చూసినా దొంగతనాలు జరుగుతున్నట్లు సమాచారం అందుతుందని వివరించారు. అయితే శాంతి భద్రతల పరిరక్షణ,చోరీలను అరికట్టుటకు పోలీసులతో సహకరించాలన్నారు. శివరాత్రికి అంతరాష్ట్ర దొంగలు వస్తారని కాబట్టి యువకులు రాత్రి వేళల్లో సంచరించవద్దన్నారు.అంతేకాక ఇటీవల కాలంలో మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. అంతేకాక పట్టణంలోని దుకాణాల వద్ద ప్రతి ఒక్కరు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

## శివరాత్రిలో కార్యక్రమాలకు దరఖాస్తు చేసుకోండి

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 8 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో జరుగు శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో మహాశివరాత్రి పర్వదినాన నాన్‌స్టాప్ కార్యక్రమాలు నిర్వహించుటకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు శ్రీ పద్మకళా క్షేత్రం డాన్స్ అకాడమి నిర్వాహకులు శనివారం తెలిపారు. మహాశివరాత్రి పర్వదినాన ఇంటర్నేషనల్ ప్రైడ్ వరల్డ్ రికార్డు కార్యక్రమాలను రూపొందించినట్లు వివరించారు. ఇందుకు దరఖాస్తు చేసుకోవచ్చునని వివరించారు. ఎంఆర్‌పల్లి బైపాస్ క్రాస్‌రోడ్డులోని భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన సాయంత్రం నుంచి ఉదయం 6గంటల వరకు శివతాండవం,నాట్యప్రదర్శన,భరత నాట్యం, కూచిపూడి, వేదపారాయణం, మ్యూజిక్ హరికథ, ప్రదర్శనలుంటాయని వివరించారు. ఆసక్తి కల్గిన కళాకారులు తమ దరఖాస్తులను పంపాలని కోరారు. పాల్గొన్న వారికివరల్డ్ రికార్డు సరిపికేట్లు,మెమొంటో,మెడల్స్ బహుకరిస్తామని వివరించారు.

## సోలార్ విద్యుత్‌తో వినియోగదారులకు ఆదా

–సూర్యఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

–తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతిరూరల్, ఫిబ్రవరి0 8 ప్రభాతవార్త:



ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. సూర్యఘర్ పథకంపై అవగాహనకు ఏపిఎస్పీడిసిఎల్ సోలార్ కంపెనీలతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. సోలార్ కంపెనీలు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను అధికారులతో ఎమ్మెల్యే పరిశీలించారు. 2024లో కేంద్ర ప్రభుత్వం సూర్యఘర్ యోజన పథకాన్ని తీసుకొచ్చిందని, ఈ పథకం కింద సోలార్‌రూఫ్‌టాఫ్ ఏర్పాటు చేసుకునేవారికి 50శాతం సబ్సీడిని ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. 2027నాటికి కోటి ఇళ్లకు సౌర విద్యుత్ అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. సోలార్ రూఫ్ టాఫ్ ఏర్పాటుతో నాలుగేళ్ళకు పెట్టిన ఖర్చు తీరిపోను 26 సంవత్సరాలు పాటు సౌర విద్యుత్ పొందవచ్చునని తెలిపారు. బ్యాంకులు సైతం ఈ పథకాన్ని తక్కువ వడ్డీతో ఋణాలు ఇస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిజిఎంలు రమణదేవి, డిఎస్ వరకుమార్, ఎస్.ఇ.సురేంద్రనాయుడు,ఈఈ చంద్రశేఖర్‌రావు, డిఇ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రీప్రైమరి స్పోర్ట్స్ డే

తొట్టంబేడు,ఫిబ్రవరి 8 ప్రభాతవార్త



తొట్టంబేడు మండల పరిధిలోని శ్రీ ధర్మరాజుల స్వామి ఆలయం వద్ద ఉన్న శ్రీచైతన్య పాఠశాల–3లో ప్రీప్రైమరి స్పోర్ట్స్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి పెంచుటకు ఈ కార్యక్రమాలను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. చిన్నారులు క్రీడా దుస్తులు ధరించి మార్చ్ ఫాస్ట్ జరిపించారు. ప్రిన్సిపల్ నిరోషాకు స్పోర్ట్స్ టార్చ్‌ను అందజేసారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. విద్యార్థులు వివిధ పాటలకు నృత్యాలు చేస్తూ సంబరాలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమాల్లో ఎజిఎం సురేష్, డీన్ సురేంద్ర ఇన్‌చార్జి రమేష్, సోనియా పిఇటి శంకర్ సిబ్బంది తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కారానికే చక్కటి వేదిక 'ప్రజా దర్బార్'

–ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుపతిరూరల్, ఫిబ్రవరి08 ప్రభాతవార్త:



ప్రజా సమస్యలు పరిష్కరించుటకు ప్రతి శనివారం పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. శనివారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని రఘనాథ్ రిసార్ట్స్‌లోని టిడిపి కార్యాలయంలో నిర్వహించారు. చంద్రగిరి నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రజా సమస్యలను పరిష్కరించుటకు ఈ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు తెలిపారు. ప్రతి సోమవారం చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా అధికారులు చేపట్టే సమస్యలు పరిష్కార వేదికకు దీనిని అదనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. గత పాలకులు అనుసరించిన దుర్మార్గపు విధానాలతో పల్లెలలో ప్రశాంతత లేకుండా సమస్యలతో సతమతమౌతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ప్రభుత్వం మంచిపాలన ప్రజలకు అందించాలనే పట్టుదలతో పని చేస్తున్నారని తెలిపారు. అధి నాయకత్వం ఆదేశాలతో అనుక్షణం ప్రజా సంక్షేమానికి సమస్యలు పరిష్కారానికి తాను అంకిత భావంతో పని చేస్తున్నారని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమస్యలు లేని, వివాద రహిత నియోజకవర్గంగా చంద్రగిరిని తీర్చిదిద్దటానికి కృషి చేస్తానని తెలిపారు.

## గోయాజ్ సిల్వర్ జువెలరీ షోరూం ప్రారంభం

తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :



తిరుపతి వీవీమహల్ రోడ్డులో ఏర్పాటు చేసిన గోయాజ్ సిల్వర్ జువెలరీ షోరూంను ప్రముఖ సినీ హీరోయిన్ మీనాక్షి చౌదరి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. తిరుపతిలో 8వ గోయాజ్ సిల్వర్ జువెలరీ షోరూంను ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఈ షోరూంలో నాణ్యమైన బంగారం, వెండితో పాటు అద్భుతమైన డైమాండ్ ఆభరణాలు ప్రజలు, యువతీ, యువకులకు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. తాను గోయాజ్ అభిమాని అని అన్నారు. మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. షోరూం అధినేతలు ప్రియాంక, రవితేజ మాట్లాడుతూ తమ షోరూంలో మొదట ప్రారంభం రోజునే ఆఫర్లు ఇవ్వడం జరిగిందన్నారు. లక్ష రూపాయలకు నక్లెస్ కొన్న వారికి రూ. 50వేలు విలువ జేసే చైను, 50 వేల రూపాయలకు కొన్న వారికి రూ. 25 వేలు విలువ చేసే బంగారు ఆభరణాలను ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ ఆఫర్ 8వ తేది నుంచి 16వ తేది వరకు ఉంటాయని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతకు ముందు హీరోయిన్ ప్రేక్షకులు, అభిమానుల మధ్య హల్ చల్ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, సిబ్బంది, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## బిజెపి, టిడిపి విజయోత్సవ ర్యాలీ...

రేణిగుంట ఫిబ్రవరి 8 ప్రభాతవార్త



ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి ఘన విజయం సాధించడం పై రేణిగుంట పట్టణంలో బిజెపి, టిడిపి కూటమి నేతలు శనివారం ర్యాలీ నిర్వహించారు. ముందుగా మిఠాయిలు తినిపించుకుని అందరికీ పంపిణీ చేశారు. బాణసంచా కాల్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. సందర్భంగా నేతలు మాట్లాడుతూ భారత ప్రజలంతా నరేంద్ర మోడీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు. ఇందుకు నిదర్శనం మొన్న మహారాష్ట్రలో, నేడు ఢిల్లీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో జిల్లా బిజెపి కార్యదర్శి బీడీ బాలాజీ, బిజెపి అధ్యక్షుడు ప్రేమ్ కుమార్ రెడ్డి, మండల బిజెపి ఉపాధ్యక్షుడు రాజా రాయల్, పట్టణ బిజెపి అధ్యక్షుడు నరేష్ రాయల్, బిజెపి జిల్లా మాజీ కోశాధికారి శ్యామ్ చంద్ గెహ్లాట్, రాజశేఖర్, వేణుగోపాల్, కేశవులు, అశోక్, జాన్ మధుకర్, ఆకుల ప్రభాకర్, రేణిగుంట టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ డి పుష్పనాదం, అంబికా పతి, టిడిపి యూత్ నాయకులు ఎంజీ రెడ్డి, సాగర్, సుమన్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసులో నిందితుడు జగదీష్ అరెస్టు

సత్యవేడు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:

సత్యవేడు మండలం ఓబుల్‌రాజు కండ్రిగలో ఆటో డ్రైవర్ లక్ష్మయ్య మృతికి సంబంధించి నమోదైన హత్య కేసులో నిందితుడు జగదీష్‌ని(39) అరెస్టు చేసినట్లు పుత్తూరు డీఎస్పీ రవికుమార్ పేర్కొన్నారు. వరదయ్యపాళెం మండలం చిన్న పాండూరు నుంచి ఎరువులు తీసుకెళ్ళడానికి ఓబుల్‌రాజు కండ్రిగ గ్రామానికి చెందిన జగదీష్ ఆటోను నడుపుతున్న లక్ష్మయ్యను పిలిచిన నేపథ్యంలో దీనిపై తలెత్తిన వివాదం చివరకు లక్ష్మయ్యపై దాడికి పూనుకున్నారు. ఈ క్రమంలో తిరుపతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ లక్ష్మయ్య మృతి చెందాడు. దీనికి సంబంధించి సత్యవేడు పోలీస్‌స్టేషన్‌లో ఫిబ్రవరి 3 తేదీ తొలుత ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు కావడం, లక్ష్మయ్య మృతి చెందడంతో హత్య కేసుగా మార్చారు. దీనిపై పుత్తూరు డీఎస్పీ రవికుమార్ సూచనల మేరకు సీఐ మురళి, ఎస్‌ఐ రామస్వామి ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగానే రాజగోపాలపురం గ్రామానికి చెందిన నిందితుడు జగదీష్‌ని ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించినట్టు ఈ సందర్భంగా పుత్తూరు డీఎస్పీ రవికుమార్ తెలిపారు. త్వరలోనే మరో నిందితుడిని కూడా అదుపులోకి తీసుకుంటామన్నారు.

## ఘనంగా కల్యాణ వేంకటేశ్వరుని ఏకాదశి ఉత్సవం

నారాయణవనం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :



నారాయణవనంలోని కల్యాణవెంకటేశ్వరుని ఆలయం శనివారం ఏకాదశి ఉత్సవంతో ఆలయం కిటకిటలాడింది. అంతకు ముందు అమ్మవారిని,స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి, శుద్ధి, పుణ్యవచనం, గంట, అర్చన, బలి, తోమాలసేవ, నిత్యకైంకర్య పూజ కార్యక్రమాల అనంతరం పాలు, పెరుగు, నెయ్యి వంటి సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం స్వామి, అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి ఊరేగించారు. ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బావిలో ప్రమాదవశాత్తు పడి ఆర్టీసీ కండెక్టర్ మృతి

నారాయణవనం , ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :



పుత్తూరు–చెన్నై జాతీయ రహదారిలోని నారాయణవనం మండల కేంద్రం పోలీస్‌స్టేషన్ ఎదురుగా వున్న వ్యవసాయ బావిలో ఓ ఆర్టీసీ కండెక్టర్ మృతి చెందిన సంఘటన శనివారం ఉదయం చోటు చేసుకున ్నట్టు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. వివరాలు ఇలా .. ఏర్పేడు మండలం పాపానాయుడుపేటకు చెందిన తులసీ (50) తిరుమల డిపోలో కండెక్టర్‌గా పని చేస్తున్నారు. తులసీ గురువారం డిపోకు వెళ్లి డ్యూటీ పుస్తకంలో సంతకం చేసి ఆపై డ్యూటీ చేయకుండా వచ్చేశాడు. దీంతో కుటుంబసభ్యులు డ్యూటీకి వెళ్లిన తులసీ కోసం వెతికారు. శనివారం ఉదయం నారాయణవనంలోని ఓ బావిలో తేలాడుతున్న వ్యక్తిని బయటకు తీశారు. ఆ జేబులోని ఆధార్‌కార్డు ఆధారంగా తులసీగా గుర్తించారు. అనంతరం కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతో గుర్తు పట్టారు. అయితే గత కొద్దిరోజులుగా మానసిక స్థితి బాగా లేదని తెలిసింది. మృతదేహానికి పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పంచనామా చేసి బంధువులకు అప్పగించారు. ఎస్ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్‌కు స్పందన

కేవీబీ పురం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:

కేవీబీ పురం మండలంలో స్విమ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాలకు మండల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కఠారి కుమార్ తెలిపారు. కేవీబీ పురం ప్రాథమిక ఆరోగ్యకేంద్ర పరిధిలోని కళత్తూరు, కాట్రపల్లి గ్రామాల్లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో మండలంలో పింక్ బస్సు ద్వారా మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ వేగవంతంగా జరుగుతుందన్నారు. బీపీ, షుగర్ పరీక్షలతో పాటు పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణకు మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఫిబ్రవరి 10న ఎగువపూడి, ఎంఏ రాజుల కండ్రిగ, ఫిబ్రవరి 11న ఆరె, సదాశివపురం గ్రామాల పరిధిలో పింక్ బస్సు ద్వారా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్విమ్స్ వైద్యాధికారులు హరిత, పద్మావతి, వాణి, ఎంపీహెచ్ఈవో రవిచంద్రరాజు, పీహెచ్ఎన్ వెంకటమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు జయంతి, ప్రియ, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## భాగ్యలక్ష్మి భూమిని ఎవరూ కబ్జా చేయలేదు

– ఆమె తనపై చేసిన ఆరోపణలో నిజం లేదు – బాధితుడు గిరిధర్ మురారి నాగరాజు వెల్లడి

తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త ః

తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం తనపై భాగ్యలక్ష్మి ఆమె భర్త చంద్రశేఖర్‌తో కలిసి ప్రెస్‌మీట్ పెట్టి వారి భూమిని తాను కబ్జా చేశానని చేసిన ఆరోపణలో నిజం లేదని, ఆమె భూమి ఎవరూ కబ్జా చేయలేదని బాధితుడు గిరిధర్ మురారి నాగరాజు వెల్లడించారు. ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేణిగుంట మండలం కొత్తపాలెం లెక్కదాఖలాలో సర్వేనెం. 104/5ఏలో 0.89 సెంట్లు భూమి ఉందని, అయితే సర్వేనెం. 104/ఏలో 2 ఎకరాల 74 సెంట్ల భూమి ఉందని, అయితే 2 ఎకరాల 97 సెంట్లు భూమి అని వారు ప్రకటించడమే వారి తప్పుడు తనానికి నిదర్శనమన్నారు. ఈ భూమి పాడి కృష్ణారెడ్డి పేరుతో ఉందని, భాగ్యలక్ష్మికి ఎటువంటి సంబంధం లేదన్నారు. కృష్ణారెడ్డి భూమిని తాము కొన్ని ఏళ్ళుగా కౌలు చేస్తున్నామని, అయితే చంద్రగిరికి చెందిన భాగ్యలక్ష్మి 2014, ఏప్రిల్ 22న అప్పటి తహశీల్దార్ మనోహర్ పాస్‌బుక్‌లో మంజూరు చేసినట్లు వారు తెలిపారని, అయితే వాస్తవంగా ఆ సమయంలో తహశీల్దార్ నాగేశ్వరరావు ఉన్నారన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. భాగ్యలక్ష్మి ఫోర్జరీ డాక్యుమెంట్స్ సృష్టించి తమపై తప్పుడు ఆరోపణలు చేశారని, ఫోర్జరీ సంతకాలతో భూమిని కాజేసేందుకు ప్రయత్నిస్తున్న భాగ్యలక్ష్మిపై అప్పుడే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు భాగ్యలక్ష్మిపై చట్టపరమైన చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామ్మూర్తి, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో బీజేపీ గెలుపుకు హర్షం

పుత్తూరురూరల్, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:

భారతీయ జనతా పార్టీ నగరి నియోజకవర్గ బీజేపీ మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు ఎం.నిషిధరాజు ఢిల్లీ ఎన్నికలకు మొదలైనప్పటి నుంచి ఎన్నికలు అయ్యేంత వరకు పర్యటించి భారతీయ జనతా పార్టీ ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వహించి అన్ని మండలాల్లో పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శనివారం నిషిధరాజు మాట్లాడుతూ 27 సంవత్సరాల తరువాత దేశ రాజధాని ఢిల్లీలో బీజేపీ ఘన విజయంసాధించిన సందర్భంగా గౌరవ ప్రధాన మంత్రి మోదీకి, అధ్యక్షుడు నడ్డాకి, అమిత్‌షాకి, బీజేపీ మహిళా మోర్చా జాతీయ అధ్యక్షులు వానతి శ్రీనివాసన్, ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షులు పురంధేశ్వరి, ఢిల్లీ బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు ఓటర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పుత్తూరు మండల బీజేపీ మాజీ కార్యదర్శి లక్ష్మీవర్మ, జిల్లా ఓబీసీ కార్యదర్శి శంకర్, జనసేన పార్టీ కన్వీనర్ మహేష్, పుత్తూరు మండలం మాజీ ఉపాధ్యక్షుడు మధు, మాజీ ప్రధాన కార్యదర్శులు మునస్వామి, గణేష్, బీజేవైఎం యువ మోర్చా అధ్యక్షుడు కిషోర్, పుత్తూరు మండలం జనసేన ఉపాధ్యక్షుడు గుణ, బీజేపీ ఎస్టీ మోర్చా అధ్యక్షుడు బాబ్జి, పుత్తూరు మండలం ఓబీసీ అధ్యక్షులు హరి, సీనియర్ వెంకటరామరాజు, చక్రపాణిరెడ్డి, భక్తవత్సలం, కార్తీక్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాలుస్తూ మిఠాయిలు పంచి ఆనందంగా సంబరాలు చేసుకున్నారు.

## స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం: కుమారస్వామి తిప్ప వద్ద పూజలు

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 8 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల వాతావారణం చోటు చేసుకుంది. శనివారం భీష్మ ఏకాదశి సందర్భంగా స్వామి అమ్మవార్లతో పాటు సుబ్రమణ్యం స్వామిల గ్రామోత్సవంను నిర్వహిం చారు. ఈ నెల 12న సద్యోముక్తి ఉత్సవంను పవిత్ర జీవనది స్వర్ణముఖిలో నిర్వహించనున్నారు. దాంతో శివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టినట్లే అవుతుంది. భీష్మఏకాదశి సందర్భంగా స్వామి అమ్మవార్లతో పాటు వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం స్వామిని చక్కగా అలంకరించి గ్రామోత్సవంగా కుమారస్వామి తిప్ప వద్దకు చేర్చారు. ఏడాదిలో ఒకే ఒక రోజు భీష్మఏకాదశి సందర్భంగా స్వామి అమ్మవార్లను కుమారస్వామి కొండ దిగువ మండపంలో ప్రతిష్టించి పరిసర ప్రాంతాల ప్రజలకు దర్శనం ఇవ్వటం ఆనవాయితి. ఇక్కడ నూతనంగా నిర్మించిన మండపంలో మొదటి భీష్మఏకాదశి పూజలు జరిపించారు.ఉత్సవంతో పాటు సిఎస్ఓ నాగభూషణం యాదవ్,టెంపుల్ ఇన్సె పెక్టర్ హరియాదవ్‌ల పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహించారు.

# తిరుపతి డివిజన్

## భక్తిసాగరంలో నగరసంకీర్తన

తిరుపతి(రవాణ),ఫిబ్రవరి 8ప్రభాతవార్త:



శనివారం వేకువజామున ఆధ్యాత్మికనగరం తిరుపతి గోవిందనామస్మరణతో ప్రతి ధ్వనించింది. తిరుపతి ప్రజల్లో భక్తిభావం పెంపొందింపజేసేందుకు ప్రతి శనివారం ఉదయం రాయలసీమ రంగస్థలి కళాకారులు చేపట్టిన నగరసంకీర్తన యాత్రికుల్లో ,నగరవాసుల్లో మరింత ఆధ్యాత్మికత ఉట్టిపడేలా చేస్తోంది. రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, కళాకారులు తొండడమనాటి సుబ్రమణ్యంరెడ్డి, మునినాథరెడ్డి, విక్రమ్‌స్వామి, నరసింహారెడ్డి, కృష్ణమూర్తిరెడ్డి, మేకల గంగయ్య, సురేంద్రరాజు, పద్మావతి, జయమ్మ, కళ . విగ్రహాల కల్యాణి, మురళీరెడ్డి, వందమంది కళాకారులు తిరునామం ధరించి తప్పెటతాళాలతో భజనలు చేసుకుంటూ ఆధ్యాత్మిక చింతనతో కదిలారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

## క్యాన్సర్ వ్యాధిపట్ల అవగాహన కలిగిఉండాలి

–విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో డాక్టర్ మస్తాన్

తిరుపతి(రవాణ),ఫిబ్రవరి 8ప్రభాతవార్త:



క్యాన్సర్ వ్యాధి వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో వ్యాధిపట్ల అవగాహన కలిగి ఉండాలని, నివారణ ముఖ్యమని శ్రీవేంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ రీసెర్చి ఆంకాలజీ డాక్టర్ పి.మస్తాన్‌ఖాన్ తెలిపారు. శనివారం ఉదయం ఎల్‌ఐసిరోడ్డులోని విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నెలవారీ సమావేశంలో ఆయన పాల్గొని క్యాన్సర్ వైద్యపరీక్షలు నిర్వహించారు. అవగాహన కల్పించారు. వ్యాధి మొదటిదశలో గుర్తిస్తే చికిత్స ద్వారా పూర్తిగా నయం చేయవచ్చుని, జీవన ప్రమాణాలు కూడా యథాతథంగా ఉంటాయని పేర్కొన్నారు. స్త్రీలలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మహిళల్లో రొమ్ముక్యాన్సర్ కేసులు అధికంగా నమోదవుతున్నాయని ఆందోళన చెందారు. అవగాహన కలిగివుండటంతోనే ఈ వ్యాధిని దూరం చేయవచ్చన్నారు. దాదాపు 80మంది విశ్రాంత ఉద్యోగులకు వైద్యపరీక్షలు చేయించారు. సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వి.వెంకయ్యబాబు, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ వి.రెడ్డికుమారి, స్టాఫ్‌నర్స్ పి.మెహతాజ్, సిబ్బంది రమేశ్‌బాబు, మహీంద్ర పాల్గొన్నారు. విశ్రాంత ఉద్యోగులు సంఘం ప్రధాన కార్యదర్శి సి.వెంకటేశంశెట్టి, కెఆర్ శంకర్, సిద్దయ్య, జయరామ్, మెహరున్నీబీ, భాగ్యలక్ష్మి, రమణ, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. విశ్రాంత ఉద్యోగులు ఈనెలాఖరులోపు లైఫ్‌సర్టిఫికెట్లు ఖజానా అధికారులకు అందజేయాలన్నారు. జూన్,జులై నెలల్లో ఆదాయపుపన్ను ఈ ఫైలింగ్ చేయాలని సూచించారు.

## వినియోగదారుల హక్కుల పరిరక్షణపై రేపు అవగాహన

తిరుపతి(రవాణ),ఫిబ్రవరి 8ప్రభాతవార్త:

వినియోగదారుల హక్కుల పరిరక్షణపై సోమవారం తిరుపతి,చిత్తూరు,అన్నమయ్యజిల్లాల వినియోగదారుల సంఘ ప్రతినిధులకు శిక్షణ ఉంటుందని ప్రతినిధి రాజారెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం 10గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు తిరుపతి యూత్‌హాస్టల్‌లో వినియోగదారుల సంఘ ప్రతినిధులు, సంస్థల ప్రతినిధులకు ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించి, సర్టిఫికెట్ అందజేయబడుతుందన్నారు. మరిన్ని వివరాలకు రాజారెడ్డి, 9393620006 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

## మోడీ ప్రభంజనం .. ఢిల్లీలో బిజెపి ఘనవిజయం

బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటముని

చంద్రగిరి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:



యావత్ భారతదేశంలో మోడీ నాయకత్వం ప్రభంజనం సృష్టిస్తున్న వేళ మరోసారి ఢిల్లీలో ప్రతిధ్వనించి భారతీయ జనతా పార్టీ అఖంధ విజయం సాధించడంలో దోహదపడిందని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటముని అన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 70 సీట్లున్న ఢిల్లీ అసెంబ్లీలో బిజెపి 48 సీట్లతో తిరుగులేని మెజార్టీని సాధించినట్లు తెలిపారు. ఈ ఎన్నికల ఫలితాలు ఆప్‌కు చెంప పెట్టు కాగా కాంగ్రెస్‌కు గొడ్డలిపెట్టు కాగదలన్నారు. బిజెపి విజయంతో చంద్రగిరిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వీట్లు పంచుతూ మోడీ నాయకత్వం వర్ధిల్లాలంటూ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకుడు సుబ్రమణ్యం యాదవ్, మండల అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ సునీల్‌కుమార్ యాదవ్, నాయకులు దొరస్వామి, నరేష్‌కుమార్ నాయుడు, కృష్ణమూర్తి నాయుడు, టి.ఏ.ప్రసాద్, మోహన్ రాజు, ఇందు శేఖర్, నవీన్‌కుమార్ రెడ్డి, మోహన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## తిరుచ్చి వాహనంపై దేవేరులతో శ్రీనివాసుడు

చంద్రగిరి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:



శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం శ్రీనివాసుడు తనదేవేరులు శ్రీదేవి భూదేవి సమేతంగా తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ వరలక్ష్మి, ఏఈఓ జ్యువెలరీ ధనంజయ, సూపరింటెండెంట్ ఈ. రాజకుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, అర్చకులు కళ్యాణ సాయికృష్ణ, సిబ్బంది రవిచంద్రన్, తిరువెంగాడం, డాక్టర్ ఉదయ్‌తేజ, రమణయ్య,పాల్గొన్నారు.

## రెవెన్యూ దాడులతో ఇసుకాసురుల బెంబేలు

2 జెసిబిలు, 3 టిప్పర్లు సీజ్

చంద్రగిరి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త:



రెవెన్యూ బృందాల వరుసదాడులతో ఇసుకాసురులు బెంబేలెత్తిపోతున్నారు. ఇసుక అక్రమ రవాణాపై కన్నెర్రజేసిన తహశీల్దార్ శివరామ సుబ్బయ్య శనివారం 2 జెసిబిలను, 2 టిప్పర్లను సీజ్ చేయించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అదేవిధంగా సిఐ సుబ్బరామిరెడ్డి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఒక టిప్పర్‌ను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. స్వర్ణముఖీనదిలో రెవెన్యూ, పోలీసు బృందాలతో నిత్యం పహారా కొనసాగించి, ఇసుక అక్రమ తరలింపుకు అడ్డుకట్ట వేస్తామని హెచ్చరించారు

## మండలంలో మొదలైన రైతు నమోదు కార్యక్రమం

పాకాల, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త

పాకాల మండలం వ్యవసాయాధికారి పి. పుష్పలత శనివారం మండలంలో రైతు నమోదు కార్యక్రమం తప్పనిసరి అని ఒక ప్రకటనలో తెలియజేశారు. రాష్ట్రంలో రైతు నమోదు పక్రియ మొదలైనది అని, పాకాల మండలంలోని ప్రతి రైతు తమకు దగ్గరలో ఉన్న రైతు సేవ కేంద్రములలో ఎఫ్ఆర్ నమోదు చేసుకోవలసినదిగా తెలియజేశారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ మొదలగు ప్రభుత్వ ప్రాయోజిత పథకాల కింద వచ్చే ఆర్థిక సాయం కొరకు పై తెలిపిన విధంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాత మాత్రమే నగదు జమ అవుతుంది. రిజిస్ట్రేషన్‌కు కావలసినవి రైతు ఆధార్ కార్డ్, వన్ బి నమూనా, ఫోన్ నెంబర్, వివరాలతో దగ్గరలోని రైతు సేవ కేంద్రంలోని వ్యవసాయ అధికారిని కలిసి రైతు నమోదు కార్యక్రమం చేయించుకోవాలి అనిపాకాల మండల వ్యవసాయ విస్తరణ అధికారి రమేష్ నాయక్ తెలిపారు.

## బిపిఎస్, ఎల్ఆర్ఎస్‌కి దరఖాస్తు చేసుకోండి

కమిషనర్ ఎన్. మౌర్య

తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 8, ప్రభాతవార్త



నగర పాలక సంస్థ పరిధిలో పెండింగ్ లో ఉన్న బిపిఎస్, ఎల్ఆర్ఎస్‌కి దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ ఎన్.మౌర్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2019వ సంవత్సరంలో దరఖాస్తు సమర్పించి ఇప్పటికీ క్రమబద్దీకరణ కాకుండా పెండింగ్ లో ఉన్న అర్జీదారులకు మార్చి 31వ తేదీ వరకు మరో అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. అలాగే 2020వ సంవత్సరంలో ప్రభుత్వం జారీ చేసిన లేఔట్ రేగులరైజేషన్ స్కీం 2020 నందు అనుమతిలేని లేఔట్లు, ప్లాట్లు కమబద్ధీకరించుకోవడానికి మరో అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. భవనాలు క్రమబద్దీకరించుకోవడం వలన ప్రత్యేకంగా ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ పొందవలసిన అవసరం లేదని, భవిష్యత్తులో భవన నిర్మాణ ఫీజు లో మినహాయింపు ఉంటుందని, ఆస్తిపన్ను పై ఎటువంటి పెనాల్టీ ఉండదని తెలిపారు. ఎల్.ఆర్.ఎస్. ను 2007 తరువాత తిరిగి అమలులోకి తేవడం.జరిగిందని అన్నారు. లేఔట్ల, ప్లాట్లు క్రమబద్ధీకరించుకోవడం వలన 14 శాతం ఓపెన్ స్పేస్ చార్జీలు మినహాయింపు ఉంటుందని, పీనల్ చార్జీల నుండి మినహాయింపు ఉంటుందని, రోడ్డు మరియు యాజమాన్య హక్కులు ధ్రువీకరించబడతాయని తెలిపారు.

## జీతాలు ఎప్పుడిస్తారు బాబూ...!

–అప్పులు పాలవుతున్నామంటూ ఉద్యోగుల ఆవేదన

తిరుపతి విద్య, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త



ఎస్వీయూలో వేతన జీవుల అవస్థలు వర్ణనాతీతం గత ఏడు నెలలుగా నెల ప్రారంభంలో జీతాలు అందిన దాఖలాలు లేవు. 9తేదీ వస్తున్నా అధికారులు వేతనాల ప్రస్తవన ఎత్తడం లేదని శాశ్వత, తాత్కాలిక, పెన్షన్ దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచే ప్రతి నెల క్రమం తప్పకుండా ఒకటో తారీఖున వేతనాలు చెల్లిస్తామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కిందంటూ ఉద్యోగులు మదన పడుతున్నారు. సకాలంలో జీతాలు అందక కుటుంబం నడవకపోగా, బ్యాంకు రుణాలు, ఈఎంఐల చెల్లింపులు వేధిస్తున్నాయని ఏమి చేయాలో పాలుపోని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నామని వర్సిటీలో ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

### నాయుడుపేట పరిసరాల్లో మొదలైన వరికోతలు...

# గిట్టుబాటు ధరలేక... రైతు విలవిల



నాయుడుపేట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : రైతులు ఆరుగాలం కష్టపడి వేలకు వేలు అప్పులుచేసి సాగు చేపట్టిన వరిపైరులో ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపో వడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. నాయుడుపేట మండలంలోని రామారెడ్డికండ్రిగ, పూడేరు, అరవపెరిమిడి, పుదూరు తదితర గ్రామాల్లో రైతులు వరికోతలు కోయడం మొదలు పెట్టారు. నాయుడుపేట మండలంలో రైతులు 9950 ఎకరాల్లో వరిపైరును సాగుచేపట్టారు.అందులో ముఖ్యంగా బిపిటి జిలకర మసోర, కెఎన్ఎమ్, ఆర్ఎన్ఆర్లు, నెల్లూరు మసోర, తదితర రకాల వరిని రైతులు ఆధునిక పద్ధతులో వ్యవసాయంను సాగు చేపట్టారు. అయితే గత సంవత్సరంతో పోలిస్తే ఈఏడాదిలో వాతావరణంలో చోటుచేసుకొన్న మార్పులు కారణంగా వరుసగా వచ్చిన తుపాన్లు ప్రభావంతో వరిపైరు పొట్టదశలో ఉన్నపుడు కురిసిన వర్షాలకు దిగుబడి గణనీయంగా తగ్గుముఖం పట్టినట్లు అన్నదాతలు వాపోతున్నారు. ఒక ఎకరాకు 20నుండి25 బస్తాలు మాత్రమే దిగుబడి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. దిగుబడికి తగట్టుగా ధాన్యం రేటు కూడ గిట్టుబాటు కావడం లేదన్నారు.గత సంవత్సం దాన్యంరేటు 2000 నుండి 2300 వరకు పలుకగా ఈ ఏడాది మాత్రం 1600నుండి 1650రూపాయలకు దళారులు కోనుగోలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. వరికోత మిషన్లకు మాత్రం గంటకు 2200 నుండి 2400వరకు ఏజంట్లు వసూళ్ళు చేస్తునట్లు రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు-ప్రజాప్రతినిధులు స్పందించి రైతులు పండించిన ధాన్యనికి గిట్టుబాటు ధరకల్పించాలని అన్నదాతలు కోరుతున్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు : డిఎస్పీ



కోట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: బహిరంగ ప్రదేశాల్లో ఎవరైనా మద్యం సేవిస్తే అటువంటి వారి పట్ల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గూడూరు డిఎస్పీ గీతాకుమారి హెచ్చరించారు. శనివారం ఆమె వాకాడు పోలీసుస్టేషన్ తనిఖీ అనంతరం గూడూరు వైపు వెళుతూ మార్గం మధ్యలో కోట క్రాస్‌రోడ్డువద్ద ఆగారు. ఈ సందర్భంగా అక్కడ చెత్తను చూసి స్పందించారు. చెత్తాచెదారాలను తొలగించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆమె వెంట సిఐ హుస్సేన్‌బాషా, ఎస్ఐ పవన్‌కుమార్ ఉన్నారు.

## ఢిల్లీ పీఠం కైవసం.. కోటలో బిజెపి సంబరాలు



కోట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించడంతో శనివారం కోటలోని బిజెపి శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఢిల్లీ గడ్డ బిజెపి అడ్డా అంటూ నినాదాలు చేశారు. మోడీ నాయకత్వాన్ని ఢిల్లీ ప్రజలు ఆశీర్వదించారని రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షుడు వాసు, వెంకయ్య, సుబ్బారావు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## ఇకపై సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం



కోట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు మరింత నాణ్యతగా భోజనం అందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సన్న బియ్యంతో విద్యార్థులకు భోజనం అందించాలని మంత్రివర్గ సమావేశంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేసిన ప్రతిపాదనకు పౌరసరఫరాలశాఖ మంత్రి సహకరిస్తామని చెప్పడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ప్రాంతాలవారీగా విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని జిల్లా అధికారులను ఆదేశించి ఉన్నారు.

## దేవాంగ అభ్యుదయ సంఘం మహిళా ఇన్‌ఛార్జ్‌గా శైలజ



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలోని ఆంధ్రప్రదేశ్ దేవాంగ అభ్యుదయ సేవాసంఘం మహిళా ఇన్‌ఛార్జ్‌గా పులిమి శైలజను నియమి స్తున్నట్లు రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి బుద్ది విజయలక్ష్మి వెల్లడించారు. శనివారం ఇందుకు సంబంధించిన నియామక పత్రాన్ని శైలజకు అందజేశారు. ఈ కార్యక్రమం రాష్ట్ర కన్వీనర్ గుత్తి త్యాగరాజు చేతులు మీదుగా జరిగింది. బండ్ల యుగంధర్, చేనేత కార్మిక జిల్లా ఉపాధ్యక్షులు యర్రా హేమభూషణం, ఎం.ప్రభావతి, పార్వతి, మంజుల, సులోచన, గిరిజ, జీవానందం, వసంతకుమార్, పద్మావతి, దిలీప్‌లు పాల్గొన్నారు.

## సామాజిక తనిఖీలు పక్కాగా నిర్వహించాలి : ఎంపీడీవో



బాలాయపల్లి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: సామాజిక తనిఖీలు పక్కాగా నిర్ధయించాలని ఎంపీడీవో డీజే వినీల్ కుమార్ సిబ్బందికి తెలిపారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించిన 17వ విడత సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం ఎంపీడీవో డీజే వినీల్ కుమార్ అధ్యక్షతన జరిగింది. 24పంచాయతీలలో జరిగిన రూ.15,03,46, 555 మెటీరియల్, కాంపోనెంట్స్ రూ.1,28,29,831 మొత్తం రూ.16,31,76,836లకు సామాజిక తనిఖీ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. సామాజిక తనిఖీలు పక్కాగా నిర్వహించాలని, అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని అన్నారు. రేపటి నుంచి బృందాలుగా ఏర్పడి గ్రామాలలో తనిఖీలు చేపడుతున్నట్లు డిఆర్పి వినోద్ తెలిపారు. ఈ సమన్వయ కమిటీ సమావేశంలో ఏపీవోలు లక్ష్మీనారాయణ, మృత్యుంజయరావు, ఎంపీడీవో డీజే వినీల్ కుమార్, ఎస్.ఆర్.పై.కె.వెంకయ్య, డిఆర్పీ యేసయ్య, పంచాయతీ రాజ్ ఏఈలు ధన్య, చంద్రశేఖర్ టిఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

## వైభవంగా ప్రారంభమైన భావనఋషి తిరునాళ్ల



వెంకటగిరి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : పద్మశాలీల ఆరాధ్య దైవం అయిన భావన ఋషి వైభవంగా ప్రారంభమైంది. పట్టణంలోని పలుచోట్ల వైభవంగా అరుస్తూ తిరుణాలను పద్మశాలీలు నిర్వహిస్తారు. మొదటి రోజు కలిసి పూజ ఖడ్గమాల నిర్వహించారు. భావన రుషి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైభవంగా భావనఋషి తిరునాళ్ల ప్రారంభమయ్యాయి.

## వాకాడు పోలీస్‌స్టేషన్‌ను డిఎస్‌పి తనిఖీ

వాకాడు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: వాకాడు పోలీస్ స్టేషను శనివారం గూడూరు డిఎస్పి గీత ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాకాడు పోలీస్ స్టేషన్లో రికార్డును పరిశీలించారు, మండలంలోని క్రైమ్ ట్రాఫిక్ తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన నూతన పోలిస్టేషన్ భవనమును డి.ఎస్.పి గీత పరిశీలించారు. నూతన భవనం శిథిల వ్యవస్థకు గల కారణాలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట సీఐ హుస్సేన్ భాష, ఎస్సై నాగబాబు సిబ్బందిలు ఉన్నారు.

## సీనియర్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



చిల్లకూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : చిల్లకూరు మండలం కలవకొండలో మండల సీనియర్ క్రికెట్ టోర్నమెంట్ 16వ వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్సై సురేష్ బాబు చేతుల మీదుగా క్రీడా జెండాను ఎగరవేసి, క్రీడాకారులను పరిచయం చేసుకుని, రిబ్బన్ కట్ చేసి, క్రికెట్ టోర్నమెంటును ప్రారంభించారు. అనంతరం ఇరుజట్ల క్రీడాకారులు క్రికెట్ మ్యాచ్‌ను ఆడారు. ఈ కార్యక్రమంలో చింతవరం జడ్పీ హైస్కూల్ హెచ్ఎం శివ సుబ్రహ్మణ్యం, చిల్లకూరు మండలం సీనియర్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు చేవూరు నాగరాజు, ఆర్గనైజర్లు మధు, మోహన్, రఘు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# నాగబాబు సభతో కూటమి శ్రేణుల్లో జోష్



పుంగనూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త :జనసేన రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబు నియోజకవర్గంలోని సోమలలో నిర్వహించిన బహిరంగ సభతో నియోజకవర్గంలో జనసేన బీజేపీ తెలుగుదేశం కూటమి పార్టీలలో ఉత్సాహం వచ్చింది. కీలక నియోజకవర్గమైన పుంగనూరులో ఎన్నికల తర్వాత వివిధ పార్టీలలో అనూహ్యమైన మార్పులు సంభవించాయి. ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ పెదిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిలకు పుంగనూరులో జనం నుంచి వ్యతిరేకత ఎదురైంది. ముఖ్యంగా వైయస్సార్ పార్టీకి చెందిన మున్సిపల్ చైర్మన్‌తో సహా 11మంది కౌన్సిలర్లు తెలుగుదేశం పార్టీలో చేరిపోయి మళ్లీ వెనక్కు తిరిగి వచ్చేసారు. వైకాపా కార్యకర్తలు నిస్తేజంగా ఉన్న తరుణంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై అనేక భూ దందాల ఆరోపణలు రావడంతో పాటు నియోజకవర్గంలో రాజకీయ సమీకరణలు తీవ్ర మార్పులకు గురయ్యాయి. ఈ నేపథ్యంలో జనసేన పార్టీ పగ్గాలు ప్రముఖ సంఘ సేవకుడు వేణుగోపాల్ రెడ్డికి ఇవ్వడంతో జనసేనలో ఉత్సాహం చోటు చేసుకుంది. ఇదే క్రమంలో పుంగనూరు నియోజకవర్గంలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు సోమలలో బహిరంగ సభ నిర్వహించడంతో పాటు, సభ విజయవంతం కావడంతో కూటమి కార్యకర్తల్లో ఉత్సాహం పెల్లుబికింది. సోమల సభలో నాగబాబు బాహాటంగా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి పై తీవ్రత విమర్శలు చేయడంతో పాటు ప్రజల ప్రభుత్వ ఆస్తులను కొల్లగొట్టిన ఎవరిని ప్రభుత్వం ఉపేక్షించదని హెచ్చరించారు. వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ పుంగనూరు నియోజక వర్గంలో రౌడీయిజం గుండాగిరి దందాలు ఇక సాగవని, కాదు కూడదని ఎవరైనా అరాచకాలకు పాలు పడితే జనసేన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కూటమి కార్యకర్తలకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చిన ఈ సభ తర్వాత బిజెపి తెలుగుదేశం పార్టీలు కూడా తమ పార్టీల నుంచి బడా నాయకులను రంగంలో దించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుం టున్నాయి. పుంగనూరులో నాగబాబు సభ రాజకీయపరంగా వైకాపాకు తీవ్ర ప్రమాదమే తెచ్చిపెడుతోంది. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై సోమల సభలో నాగబాబు సంధించిన అస్త్రాలు కూటమి శ్రేణుల్లో జోష్ నింపినట్లు అయింది.

## ప్రతి రైతు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

**- జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ**

చిత్తూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: ప్రభుత్వం నుండి రైతులు వ్యవసాయ ఆధారిత పథకాలు, సబ్సిడీ మొత్తాలు, ప్రధానమంత్రి కిసాన్ యోజన పథకం మొత్తాలు పొందడానికి ప్రతి రైతు రైతు సేవా కేంద్రంకు వెళ్ళి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ తెలిపారు. రైతు సేవా కేంద్రంకు వెళ్ళి రైతులు రిజిస్ట్రేషన్ చేసుకుంటే రైతు గుర్తింపు ఐడి వస్తుందన్నారు. రైతులు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్ కార్డు లింక్ కల్గిన ఫోన్‌ను తీసుకెళ్ళి రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన కోరారు.

## భక్తకన్నప్పకు గురుపూజ



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : సద్యోముక్తి దివ్యక్షేత్రం శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం భక్తకన్నప్ప విగ్రహానికి గురుపూజోత్సవం నిర్వహించారు. తమిళనాడుకు చెందిన మఠాధిపతులు రాగా కన్నప్పకు విశేష అభిషేకాలు నిర్వహించారు.మాఘ మాసం సందర్భంగా ఆరు రోజుల పూజల అనంతరం శనివారం మృగశిర నక్షత్రంలో కన్నప్పకు షోడషాభిషేకాలు జరిపారు. గురు మహాసన్నిధానం పీఠాదిపతి శ్రీల శ్రీఅంబలవాన దేశిక పరమాచార్య స్వామి సారథ్యంలో కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. భక్తకన్నప్ప నిలువెత్తు విగ్రహానికి ప్రత్యేక పూజలు అభిషేకాలను స్థానిక ప్రధానార్యులు కరుణాకర్ గురుకుల్ అభిషేకాలు జరిపారు.ఈ సందర్భంగా భక్తులకు భోజన వసతి కల్పించారు. సుబ్రమణ్యం ఆశ్రమంలో భక్తులకు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేసారు.

## కొత్త ఉపాధ్యాయుని నియమిస్తాం:డిఇఓ

తొట్టంబేడు,ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: తొట్టంబేడు మండలంలో బసవయ్యపాళెం పాఠశాలలో వివాదాస్పదమైన ఉపాధ్యాయుని స్థానంలో కొత్త ఉపాధ్యాయుని నియమిస్తామని జిల్లా విద్యాశాఖాధికారి కోట వెంకటనాగేంద్ర కుమార్ శనివారం వివరించారు. ఈ సంఘటనకు సంబంధించిన వార్తలు రాసిన మీడియా ప్రతినిధులను ఏఐఎస్ఎఫ్ సురేష్‌కుమార్ అంటూ చరవాణిలో బెదిరించటం గమనించదగ్గ విషయం. ఈ పాఠశాలలో పని చేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు ఓ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించారని ఆ ఉపాధ్యాయుని విద్యార్థిని తల్లిదండ్రులు పాఠశాలలో పాదరక్షతో బడిత పూజ జరిపారు. ఈ సంఘటనకు సంబంధించి జిల్లా స్థాయి విచారణ జరిగింది.అయితే ఎఐఎస్ఎఫ్ సారథ్యంలో ఆ ఉపాధ్యాయునే కొనసాగించాలని కోరుతూ ధర్నా చేసారు. ఈ సంఘటనకు సంబంధించి ప్రభాతవార్త డిఇఓ వెంకటనాగేంద్ర కుమార్‌ను వివరణ కోరగా బసవయ్యపాళెం పాఠశాలలో జరిగిన సంఘటనకు సంబంధించిన ఉపాధ్యాయునిపై వచ్చిన ఆరోపణలపై తాము గ్రామంలో విచారించామన్నారు. తాను వెళ్ళినపుడు గ్రామస్థులు ఆ ఉపాధ్యాయుని పాఠశాలకు రానివ్వమంటూ ఖరాఖండిగా చెప్పారన్నారు. దాంతో తాము ఆతన్ని సస్పెండ్ చేసామన్నారు. ఆయన స్థానంలో ఉపాధ్యాయుని త్వరలోనే నియమిస్తామని వివరించారు.

## రైల్వేస్టేషన్‌లో నాగుపాము ప్రత్యక్షం



కుప్పం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : కుప్పం రైల్వే స్టేషన్ శనివారం మధ్యాహ్నం ప్రయాణీకులతో కిటకిటలాడుతున్న సమయంలో ఓ నాగుపాము ప్రత్యక్షమైంది. ప్లాట్‌ఫామ్ నెంబరు 1కి మధ్యాహ్నం పుష్‌పుల్ రైలు వచ్చేందుకు మరో ఐదు నిమిషాల సమయం ఉండగా 2.40 గంటల ప్రాంతంలో అటుగా ఉన్న చెట్ల పొదల్లోనుంచి ఓ నాగుపాము ప్రత్యక్షమై ప్లాట్‌ఫామ్ సమీపంలోని గోడ వద్దకు పాకుకుంటూ వచ్చింది. దీంతో జనం ఒక్కసారిగా హడలెత్తారు. అనంతరం పాము గోడ పక్కనే ఉన్న ఓ రంధ్రంలోకి చేరి లోపల వెళ్లిపోవడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు.

## కల్యాణవెంకన్నగా తెప్పపై గోవిందరాజు కటాక్షం



తిరుపతి,ఫిబ్రవరి 8ప్రభాతవార్త: తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి ఆలయం పుష్కరిణిలో శనివారం సాయంత్రం స్వామిఅమ్మవార్లు కల్యాణ వేంకటేశ్వర స్వామి అలంకరణలో తెప్పపై విహరించారు. సాయంత్రంనిత్యకైంకర్యాలు ముగిసిన తరువాత స్వామివారి ఉత్సవమూర్తిని అమ్మవార్లను కల్యాణ వేంకటేశ్వరునిగా విశేష అలంకరణలోతెప్పపై వేంచేపుచేశారు.ఇక్కడ ఆలయ అర్చకులు కర్పూర హారతులిచ్చి తెప్పను కదిలించారు. భక్తుల గోవిందనామ స్మరణల మధ్య తెప్ప పుష్కరిణిలో మూడు ప్రదక్షణలు తిరిగింది. ఈ తెప్పోత్సవంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఈఓ శాంతి, ఎఈఓ మునికృష్ణరెడ్డి,ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనంజయ,అర్చకులు పాల్గొన్నారు.

## హాస్టల్స్‌ను పరిశీలించిన వర్సిటీ అధికారులు



తిరుపతి విద్య, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : ఎస్వీయూలోని ఎ మెస్లో విద్యార్థి భోజనం చేస్తున్న ఆహారంలో జెర్రి ప్రత్యక్ష్యమైన విషయంపై అధికారులు స్పందించారు. శనివారం హాస్టల్ వార్డన్లు, అధికారులు మెసన్ను పరిశీలించి జరిగిన ఘటనపై విద్యార్థులను, సిబ్బందిని ఆరా తీశారు.ఈ ఘటనలను పునావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామని, వర్సిటీలోని అన్ని హాస్టల్స్ లో పరిశుభ్రతపై సిబ్బంది దృష్టిసారించాలని, నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు హాస్టల్స్ లో పరిస్థితి దారుణంగా ఉందని, బాత్రూమ్లకు తలుపులు శిథిలావస్థకు చేరుకున్నాయని వెంటనే మరమ్మత్తులు చేయాలని అధికారులకు విన్నవించారు. రెండు రోజుల లోపు అన్ని హాస్టల్స్‌లో మరమత్తులు చేస్తామని హామీ ఇచ్చినట్లు విద్యార్థులు తెలిపారు. ఎస్వీయూలో విద్యార్థులకు వడ్డించే ఆహారంలో బల్లులు, జెర్రిలు వంటివి ప్రత్యక్ష్యమవడం నిత్యకృత్యంగా మారింది. రెండు నెలలకు ముందు వర్సిటీలోని మహిళా వసతి గృహంలో బల్లి ఆనవాళ్లు విద్యార్థులు గుర్తించారు. పెద్ద మొత్తంలో బిల్లులు కడుతున్నా నాణ్యమైన ఆహారం దొరకపోవడం దారుణమని మండిపడుతున్నారు.

**ప్రతి శనివారం పార్టీ కార్యాలయంలో...**

## ప్రజా సమస్యల పరిష్కారానికే వేదిక'



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసే సమస్యను పరిష్కరించుటకు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రతి శనివారం 'ప్రజావేదిక'ను ఏర్పాటు చేసినట్లు శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం పార్టీ కార్యాలయంలో ఎంఎల్‌ఏ శ్రీకారం చుట్టారు. ఎంఎల్ఏ మాట్లాడుతూ ప్రజలు నిత్యం వివిధ సమస్యలతో నిత్యం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ కనబడుతున్నారు. అయితే వారికి అధికారులు అందుబాటులో ఉంచటానికి నిర్ణయం తీసుకున్నామన్నారు. ముఖ్యంగా రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్‌శాఖ అధికారులను శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. అసెంబ్లీ సమావేశాలు ఉంటే తప్ప తాను కూడా అందుబాటులో ఉంటానన్నారు. నియోజకవర్గంలో ఏ ఒక్కరూ అధికారులతో సమస్యను ఎదుర్కొకూడదనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసామన్నారు. ఇక్కడ వచ్చిన వారికి సకల సదుపాయాలు కల్పిస్తున్నట్లు ఎంఎల్ఏ ప్రకటించారు.ఈ కార్యక్రమాల్లో పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్‌నాయుడు, మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు అధికారులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## ప్రజా పాలనకు పట్టం కట్టిన ఢిల్లీ ప్రజలు



గూడూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: భారతీయ జనతా యువమోర్చా బీజేవైఎం గూడూరు ఆధ్వర్యంలో గిద్దలూరు మనోజ్ కుమార్‌చే ప్రజాపాలనకు ఢిల్లీలో పట్టంకట్టి బిజెపిని ఘనవిజయంగా గెలిపించిన ఢిల్లీ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా 27 సంవత్సరాల తర్వాత మళ్లీ ఢిల్లీ గడ్డమీద బీజేపీ జెండా రెపరెపలాడిందని, ఆమ్ ఆద్మీ పార్టీ కాంగ్రెస్ పార్టీలు చిత్తుగా ఓడిపోయాయని ప్రజలు నీతికి నిజాయితీకి మంచి పాలనకు ఓటు వేసి బిజెపిని గెలిపించాలని ఆయన అన్నారు. తిరుపతి జిల్లా బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోడి మంచి కార్యక్రమాలు దేశ అభివృద్ధి అదేవిధంగా ప్రజా పాలన అంశాలపై ప్రజలు ఢిల్లీలో ఇంతటి ఘనవిజయాన్ని ఇచ్చారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నగర అధ్యక్షుడు శివశంకర్ బీజేవైఎం కార్యకర్తలు పాపయ్య, నవీన్, కిరణ్, ప్రదీప్, మహేష్ రాజు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## చిత్ర పటాల ప్రదర్శన ఏర్పాటు అభినందనీయం : ఎమ్మెల్యే



గూడూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: మన దేశ స్వాతంత్రం కోసం పోరాడిన వారి పోరాటపటమ దేశం కోసం మహనీయులు చేసిన త్యాగాలు నేటి తరానికి తెలియజేయాలని గూడూరు పట్టణంలో స్వాతంత్ర సమరయోధుల చిత్ర పటాల ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయమని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ అన్నారు. గూడూరు పట్టణంలోని దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాలలో ప్రముఖ చరిత్రకారులు సయ్యద్ నశీర్ అహ్మద్ సౌజన్యంతో ఫ్రీడమ్ ఫైటర్స్ ఎక్స్పో నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు స్వాతంత్ర సమరయోధుల చిత్రపటాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. సమరయోధుల చిత్రపటాల ప్రదర్శనను గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలు ముస్లిం సంఘాల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వేస్ట్‌ని కంపోస్ట్‌గా మార్చడానికి శిక్షణ



చిల్లకూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: అదానీ ఫౌండేషన్‌చే చిల్లకూరు మండలం లోని గుమ్మలదిబ్బ గ్రామంలో డీగ్రేడబుల్ వేస్ట్‌ని కంపోస్ట్‌గా మార్చడానికి శనివారం శిక్షణ ఇచ్చింది. వారు మాట్లాడుతూ పరిసరాలను, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి ప్రతి వ్యక్తికి ఏదైనా సంస్థకు వేస్ట్ మేనేజ్‌మెంట్ అనేది ఒక ముఖ్యమైన చర్య అని తెలిపారు. అందుకే, అదానీ ఫౌండేషన్, తమ్మిన పట్నం గ్రామ పంచాయతీ పోలేరమ్మతల్లి మహిళా బృందంతో కలిసి ఘన వ్యర్థాలను క్రమబద్ధీకరించడం జీవనాధోకరణం చెందే తడి చెత్తను కంపోస్ట్‌గా మార్చడం ద్వారా వ్యర్థాలను కంపోస్ట్‌గా మార్చడానికి శిక్షణను నిర్వహించిందన్నారు. ఈ కార్యక్రమం అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్‌లోని ఇతర పరిధీయ గ్రామాలలో సుమారు 100 మంది గ్రామ పారిశుధ్య వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు. గుమ్మలదిబ్బ, ఆర్కాటపాలెం గ్రామస్తులు, కాపుల సహకారంతో అదానీ ఫౌండేషన్‌కు చెందిన డాక్టర్ సిహెచ్ రమేష్ బాబు, రవీంద్ర టి, పి.మురళి, షేక్ షాల్ హమీద్ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో టీమ్ లీడర్లు శ్రీనివాసులు, రామ్మూర్తి, హెడ్ రాజేష్ రంజన్ పాల్గొన్నారు.

## తాగునీరు సమస్య లేకుండా చేయాలి

గూడూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త : గూడూరు పట్టణంలో పలు ఓవర్ హెడ్ ట్యాంకులను జనసేనపార్టీ ఉమ్మడి నెల్లూరుజిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖరరావు శనివారం ఆ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా పట్టణంలోని వాలయానంద పురం, మాలవ్య నగర్, మాయాబజార్ మరియు దూడల కాలువ ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఓవర్ హెడ్ ట్యాంక్లలో కొన్ని పూర్తిగా దెబ్బతినివున్నాయని, వాటి స్థానంలోనే కొత్తవి నిర్మించాలన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ పిఓసి కె.మోహన్, పట్టణ కార్యదర్శి సాయికిరణ్, సనత్, వంశీ కృష్ణ, విజయ్‌లు పాల్గొన్నారు.

## ఢిల్లీ అభివృద్ధి కొరకే...బిజెపిని గెలిపించారు



వెంకటగిరి, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: ఢిల్లీలో డబల్ ఇంజన్ సర్కారు అభివృద్ధి కావాలని ప్రజలు భారతీయ జనతా పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించారని ఆ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ ఇన్చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు తెలిపారు. ఢిల్లీలో బిజెపి విజయం సాధించినందుకు బాణసంచా పేల్చి సంబరాలు నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేస్తున్న అభివృద్ధి పనులు చూసి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో బిజెపిని గెలిపిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు గురుప్రసాద్, పట్టణ అధ్యక్షుడు కృష్ణమూర్తి, నాయకుడు తిరుపాల్రెడ్డిలు పాల్గొన్నారు.

## దేశం అభివృద్ధి ప్రధాని నరేంద్ర మోడీతో సాధ్యం

**- అంబరానంటిన ఢిల్లీ విజయోత్సవ సంబరాలు - గూడూరు అర్బన్ మండల పార్టీ అధ్యక్షులు దయాకర్**



గూడూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: భారతదేశం అభివృద్ధి చెందాలంటే ప్రధాని నరేంద్ర మోడీతోనే సాధ్యమవుతుందని అందుకు నిదర్శనం ఢిల్లీలో జరిగిన ఎన్నికల్లో బిజెపి విజయ కేతనం ఎగరవేయడమే అని గూడూరు అర్బన్ మండల బిజెపి అధ్యక్షులు కె.పేర్కొన్నారు. శనివారం గూడూరు పట్టణం టవర్ క్లాక్ సెంటర్లో అర్బన్ మండల పార్టీ బిజెపి అధ్యక్షుడు ఆధ్వర్యంలో బిజెపి నాయకు లతో కలిసి ఢిల్లీలో బిజెపి విజయకేతనం ఎగరేసిన సందర్భాన్ని పురస్కరించుకొని ఘనంగా విజయోత్సవ సంబరాలును నిర్వహించారు. టపాకాయలు పేల్చి స్వీట్లు పంచుకుని సంబరాలను జరుపుకున్నారు. పట్టణ బిజెపి మాజీ అధ్యక్షులు బాలకృష్ణ నాయుడు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీని ఢిల్లీలో లేకుండా చేస్తామని ప్రగల్భాలు బలికిన చీపురు పార్టీ నాయకుడు కేజ్రీవాల్‌కు ఢిల్లీ ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బల్లి ప్రభాకర్ రావు జీవీ నాయుడు గుమ్మడి శ్రీనివాస్ సిహెచ్ శివ డాక్టర్ మహేష్ బాలామణి నిరంజన్, పవన్ కుమార్ మణికంత సాయి దినేష్, ప్రకాష్, శ్రీను వెంకటేష్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించాలి:ఎమ్మెల్యే



గూడూరు, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: ప్రజా సమస్యలు పరిష్కారంలో భాగంగా పట్టణంలోని క్యాంప్ కార్యాలయం నందు ప్రతి సోమ, శనివారాలు గ్రీవెన్స్ డేలో పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించి అధికారులకు అందించి సమస్యలను త్వరితాగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకువాలని తెలిపిన ప్రజలను కార్యాలయాలు చుట్టూ తిప్పుకోకుండా కరెక్ట్‌గా ఉంటే త్వరగా తన పని చేసి పెట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తాసిల్దారులు చంద్రశేఖర్, శ్రీనివాసులు, ఎంపీడీవోలు మధుసూదన్ రావు, గోపి నియోజకవర్గ స్థాయిలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కుప్పం అభివృద్ధి ఇక అన్‌స్టాపబుల్!

**- 300కోట్లతో త్వరలోనే అభివృద్ధి పనులకు శ్రీకారం !!**

**- కుప్పం పట్టణ సుందరీకరణ..రోడ్లు.. డ్రైన్లు.. ఆలయాల అభివృద్ధి పనులు మొదలు !!**

కుప్పం, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త: సిఎం చంద్రబాబునాయుడు సొంత నియోజకవర్గం అయిన కుప్పంలో ఇప్పటికే పట్టాలెక్కిన అభివృద్ధి అన్‌స్టాపబుల్‌గా దూసుకుపోనుంది. దాదాపు 300కోట్లరూపాయలకు పైగా అంచనా నిధులతో త్వరలోనే నియోజకవర్గంలో అభివృద్ధి పనులు మొదలుకానున్నాయి. ఈ పనుల్లో భాగంగా కుప్పం పట్టణ సుందరీకరణ, నియోజకవర్గంలో డ్రైనేజీల నిర్మాణం, నియోజకవర్గంలో ప్రసిద్ధి చెందిన ఆలయాల అభివృద్ధి, పునర్నిర్మాణ పనులు మొదలు కానున్నాయి. గత నెలలో కుప్పం పర్యటన సందర్భంగా సిఎం చంద్రబాబునాయుడు కుప్పం మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు, నాలుగు మండలాల పరిధిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన విషయం విదితమే.

**కుప్పం మున్సిపల్ పరిధిలో 92కోట్లు :**

కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ)కు మంజూరైన 92కోట్ల నిధుల్లో మొదటివిడతగా 42కోట్లతో కుప్పం మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులకు త్వరలో టెండర్లు పిలవనున్నారు. మున్సిపల్ పరిధిలో డ్రైన్లకు 19.50కోట్లు, సర్కిళ్ల అభివృద్ధికి 10కోట్లు, స్మశాన వాటికలో బర్నింగ్‌యూనిట్‌కు 3కోట్లు, వీధిలైట్లకు 3కోట్లు మంజూరయ్యాయి. అలాగే డికెపల్లి, కుప్పం బస్టాండులోని పార్కుల అభివృద్ధికి 19కోట్లు, కమాండ్ కంట్రోల్‌రూంకు 10కోట్లు, ఎన్టీఆర్ స్టేడియంకు 22కోట్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టళ్ల మరమ్మత్తుకలు 70లక్షలు మంజూరయ్యాయి. వీటిలో పలు పనులకు త్వరలోనే శ్రీకారం చుట్టనున్నారు. ఇప్పటికే అమృత్ పథకంలో భాగంగా 9.24కోట్లతో కుప్పం మున్సిపల్‌పరిధిలో తాగునీటి సరఫరాకై పైపులైన్ల ఏర్పాటుపనులు జరుగుతున్నాయి.

**53 కోట్లతో రోడ్లకు మహర్దశ :**

గత వైఎస్సార్సీ పాలనలో గుంతలు పడ్డ రోడ్లకు ఓ రూపం కల్పించిన సిఎం చంద్రబాబునాయుడు కుప్పంలో రోడ్ల అభివృద్ధికి 53.35కోట్ల నిధులు మంజూరు చేశారు. నియోజకవర్గంలోని కుప్పం, శాంతిపురం, రామకుప్పం, గుడుపల్లె మండలాలతో పాటు కుప్పం బైపాస్ రోడ్డుతో సహా 23 ప్రధాన, సరిహద్దు ప్రాంతాల్లోని రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. ఈపనులు సైతం త్వరలో మొదలుకానున్నాయి. ఇక సుమారు 405 గ్రామాల్లో 110 కోట్లతో డ్రైనేజీలను కొత్తగా నిర్మించనున్నారు. ఇదివరకే గ్రామాల్లో 20కోట్లతో సిసి రోడ్లు నిర్మించిన విషయం విదితమే. కుప్పం నియోజకవర్గంను ఆధ్మాత్మిక కేంద్రంగా మార్చేదశగా సిఎం చంద్రబాబునాయుడు చర్యలు చేపట్టారు.